భోజనం నాసిరకంగా ఉండరాదు

కదిరి లీగల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సబ్‌జైల్లో భోజనం నాసిరకంగా ఉండరాదని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌గౌడ్ పేర్కొన్నారు. స్థానిక సబ్‌జైలును ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. న్యాయపరమైన సమస్యలు ఏమైనా ఉన్నాయా? లోక్ అదాలత్ సాయం అవసరం ఉందా? అని అడిగి తెలుసుకున్నారు. నేర ప్రవృత్తి నుంచి బయటపడాలన్నదే ప్రజా న్యాయస్థానాల ఆశయమన్నారు. అనంతరం వంటశాలను పరిశీలించారు. సబ్‌జైలులో మొక్కలు నాటారు. ఆయన వెంట సబ్‌జైలు సూపరింటెండెంట్ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.



సున్నపుగుట్టతండాలో లే అవుట్, ఇక్కడే ఎక్కువ అక్రమాలు చోటు చేసుకున్నాయి

భూం..!

- కదిరిలో వెలుగు చూస్తున్న భూబాగోతాలు
- తవ్వేకొద్ది బయట పడుతున్న అక్రమాలు
- అక్రమార్కుల్లో వైసీపీతో పాటు టీడీపీ నాయకులు
- కూటమి ప్రభుత్వం రాకతో అక్రమాలకు చెక్

గత వైసీపీ పాలనలో జరిగిన భూబాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. నకిలీ పట్టాలు, చర్చి ఆస్తుల అమ్మకం, భూ ఆక్రమణలు వంటి విషయాలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను ఇష్టారాజ్యంగా అమ్ముకుని సొమ్ము చేసుకున్న విషయాలు బయటకొచ్చాయి. దీని వెనుక మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులున్నట్లు సమాచారం. వైసీపీతోపాటు గత టీడీపీ నాయకులకు కూడా ఈ అక్రమాల్లో భాగం ఉన్నట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. పేదలకు చెందాల్సిన భూములు, పట్టాలు పెద్దవారి జేబులు నింపాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కదిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కదిరి మండలంలోని సున్నపుగుట్టతండాలో 70 పట్టాలిస్తే, 29మంది మాత్రమే అర్హులున్నట్లు తేలింది. మిగిలినవారు ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ పట్టాలు పొందినట్లు తెలుస్తోంది. రెండురోజుల కిందట మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా అనుచరుడు, వైసీపీ నాయకుడు షామీర్ బాషా వందల కొద్ది నకిలీ జిరాక్స్ పట్టాలు, పాస్‌పుస్తకాలతో పట్టుబడి జైలుపాలయ్యాడు. గతంలో చర్చి ఆస్తులు, ప్రభుత్వ భూముల ఆక్రమణల విషయంగా పలువురు వైసీపీ నాయకులపై కేసులు నమోదయ్యాయి. ఈకేసుల్లో కొంతమంది ఇప్పటికీ పరారీలో ఉన్నారు.


తవ్వేకొద్దీ వెలుగు చూస్తున్న అక్రమాలు

గతంలో జరిగిన భూ దందాలు, ఆక్రమణలు, భూ బాగోతాలు తవ్వేకొద్ది వెలుగులోకి వస్తున్నాయి. సర్వేనెంబర్ 470లో దాదాపు 40మందికిపైగా అక్రమార్కులున్నట్లు తెలిసింది. గతంలో వీటిని మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా పంపిణీ చేశారు. ఆయన ముఖ్యఅనుచరులు ఈదందాలో పాలుపంచుకున్నట్లు సమాచారం.

- మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 1777-2లో దాదాపు 4 ఎకరాలకుపైగా ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ నాయకుడు షామీర్ బాషా నకిలీ పత్రాలతో ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు. అయితే అధికారులు దీనికి అడ్డు కట్ట వేసి, ఆయనను జైలుకు పంపారు.
- నాగిరెడ్డిపల్లి వద్ద సర్వేనెంబర్ 1022, 931-1లో నకిలీ పట్టాలు, జిరాక్స్‌పట్టాలను తయారు చేసి, ఒక్కో పట్టాను రూ.30వేల నుంచి రూ.50వేల వరకు అమ్మినట్లు ఇటీవల పోలీసుల విచారణలో వెల్లడైంది. అతడి నుంచి 301 నకిలీ పట్టాలు, 168 జిరాక్స్ పట్టాలు, 32 పాస్‌పుస్తకాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇతను పెద్ద ఎత్తున భూ అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. ఈనాయకుడికి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా సహకారమున్నట్లు ఆయన అండతోనే అవి అన్నీ కొనసాగించినట్లు ఆరోపణలున్నాయి.
- చర్చి ఆస్తుల్లో అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులు బీఎస్ ఎమగ్బ్యాల్, పరికి షామీర్, హర్షద్‌లతోపాటు మరికొంతమందిపై కేసు నమోదైంది. చర్చిఆస్తుల్లో అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు అభియోగాలు మోపారు. వైసీపీ నాయకుడు పరికి షామీర్‌పై గతంలో కూడా బెంగళూరులో చర్చి ఆస్తుల కేసులో కేసు నమోదైంది. ఓ మాజీ మంత్రికూడా చర్చి ఆస్తుల కేసులో ఉన్నట్లు సమాచారం. ఆయన నేటికి చర్చి ఆస్తులను కొనడానికి విశ్వప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.
- మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 206లో ఆస్తిని ఆక్రమించి, ఇళ్లు కట్టుకోవడానికి దౌర్జన్యం చేసినట్లు వైసీపీ నాయకుడు కుర్లి శివారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే నాయకుడు హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించిన కడ్డీలను దొంగిలించిన కేసులో జైలుకెళ్లి వచ్చాడు. మరికొంతమంది వైసీపీ నాయకులు ఎంపీడీఓ కార్యాలయానికి సమీపంలో దాదాపు రూ. కోటి విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేయగా, కూటమి ప్రభుత్వంలో దీనికి అడ్డుకట్ట వేశారు.

బైపాస్ చుట్టూ భూదందాలే

కదిరికి నూతనంగా మంజూరైన బైపాస్ రోడ్డు చుట్టు పలువురు భూదందాలకు తెరలేపారు. ఓ మాజీ ఎమ్మెల్యే 36సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని, ప్లాట్లు వేసినట్లు సర్వేలో తెలింది. మరో ఇద్దరు వైసీపీ నాయకులు ఇక్కడ అక్రమంగా పట్టాలు చేయించుకున్నట్లు తెలిసింది. బైపాస్ పక్కనున్న డీకేటీ భూములను లబ్ధిదారులతో తక్కువకు కొనుగోలు చేసి, వాటిని ప్లాట్లుగా మార్చి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. కుటాగుళ్ల నుంచి మదనపల్లి రోడ్డు వరకు ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలిస్తే వీటిలో ఎక్కువశాతం పెద్దల చేతుల్లోకి వెళ్లినట్లు సమాచారం. దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో పట్టాల పంపిణీలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జగనన్న కాలనీల్లో ఇచ్చిన పట్టాలు అనేకమంది అనర్హులకు అందినట్లు తెలుస్తోంది. దీనిపై విచారణ చేయాలని కదిరి ప్రజలు కోరుతున్నారు. గట్లకు సమీపంలో సర్వేనెంబర్ 87లో దాదాపు 80 ఎకరాలకు పైగా భూమి ఉంది. ఇది మొత్తం ప్రభుత్వ డీకేటీ బంజరుభూమి. ఇందులో కొంత స్థలం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి ప్రభుత్వం ఇవ్వగా, మిగిలినదంతా ఆక్రమణలకు గురైంది. ఇందులో ఓ టీడీపీ నాయకుడుకూడా మూడు ఎకరాలకుపైగా ఆక్రమించుకున్నట్లు తెలుస్తోంది. పక్కనే ఉన్న వ్యవసాయ యోగ్యం కాని కొండగుట్టల భూములకు కొంతమంది ఎన్‌ఓసీ తెచ్చుకుని వ్యవసాయేతర భూమిగా మార్చుకుని వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ దాదాపు 30 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.



సున్నపుగుట్టతండా వద్ద ఎక్కువమంది అనర్హులకు పట్టాలించిన లేఅవుట్

అక్రమ లే అవుట్లకు చెక్

పట్టణ శివారులో గత పదేళ్లుగా వేసిన అక్రమ లేఅవుట్లకు అధికారులు చెక్ పెట్టారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే అక్రమ లేఅవుట్లపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. దీంతో అక్రమంగా లేఅవుట్లు వేసిన యజమానులు బెంబేలెత్తుతున్నారు. అక్రమ లేఅవుట్ వేసిన ఓ వైసీపీ నాయకుడికి అధికారులు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. దీంతో తమ దందాలకు అడ్డుపడుతున్నారని కూటమి ప్రభుత్వంపై కొంతమంది వైసీపీ నాయకులు అక్కసు వెల్లగక్కుతున్నారు.



చట్టరీత్యా చర్యలు: కిరణ్‌కుమార్, కమిషనర్

అక్రమ లేవుట్లు, మున్సిపల్ స్థలాల అక్రమణ తదితరవాటిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అక్రమలేవుట్ వేసిన యజమానులకు నోటీలు జారీ చేశాం. చట్ట ప్రకారం తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

గాయపడ్డ ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

- కళాశాల గుర్తింపు రద్దు చేయాలి
- మృతదేహంతో బంధువులు, విద్యార్థి సంఘాల ఆందోళన



7

'మాలగుండ్ల'ను అడ్డుకుంటాం..

- మాజీ మంత్రికి ఉష శ్రీచరణ్ వర్గం హెచ్చరిక



7

ఉద్యోగం వదిలేసినవారికి జీతాలు

- గత నెలలో మూడు నెలల వేతనాలు మంజూరు
- పని చేసిన కొత్తవారికి మొండిచెయ్యి
- ఏపీఓను నిలదీసిన ఫీల్డ్ అసిస్టెంట్లు

కొత్తచెరువు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ ఉద్యోగం వద్దు అని వదిలేసి వెళ్లిన వారికి కూడా అధికారులు మూడు నెలల జీతాలు మంజూరు చేశారు. అయితే వారి స్థానంలో పని చేసిన నూతన ఉద్యోగులకు మాత్రం పైసా రాలేదు. దీంతో వారు లబోదిబోమంటున్నారు. ఇదీ కొత్తచెరువు మండలంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల వ్యథ. రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోవడంతో మండలంలో ఆ పార్టీ సానుభూతిపరులైన పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఇక మీదట తాము విధులకు రాలేమని జూలై 10న ఏపీఓ నాగిరెడ్డి, అప్పటి ఎంపీడీఓ బారాన్‌సాబ్‌కు తెలియజేశారు. దీంతో మండలంలోని 15 పంచాయతీలకు 15 మంది కొత్త వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించారు. వారంతా తమకు కేటాయించిన ప్రాంతాల్లో మూడు నెలలు ఉపాధి పనులు చేయించారు. అయితే గత నెల 29న పాత ఫీల్డ్ అసిస్టెంట్లు 12 మందికి(15 మంది ఉండగా గతంలోనే ముగ్గురిని తొలగించారు) జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన జీతాలు రూ.2,99,611లను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఈ విషయం తెలుసుకున్న నూతన ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేసింది తామైతే పాత వారికి జీతమెలా మంజూరు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని శనివారం టీడీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో టీడీపీనాయకులు ఈ సమస్యను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నటరాజ్ దృష్టికి తీసుకెళ్లారు. పాత వారి పేరే ఆన్‌లైన్‌లో ఉండటం వల్ల వారికే జీతాలు అందాయని, పాత వారి స్థానంలో కొత్త ఫీల్డ్‌అసిస్టెంట్ల పేర్లను చేర్చి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని ఆయన తెలిపారు. ఇంతలోనే ఏపీఓ నాగిరెడ్డి అక్కడకు రాగానే ఒక్కసారిగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఆయనపై విరుచుకుపడ్డారు. పనిచేసింది మేమైతే పాతవారికి జీతాలు ఏ విధంగా ఇస్తావంటూ ప్రశ్నించారు. ఆయన ఏమిసమాధానం చెప్పలేక మిన్నకుండిపోయారు. మంజూరైన జీతాల్లో 60 శాతం ఏపీఓ, అధికారులు, 40 శాతం పాత ఫీల్డ్ అసిస్టెంట్లు పంచుకున్నారని కొత్త ఫీల్డ్ అసిస్టెంట్లు ఆరోపించారు. అలాగే కొత్త జాబ్ కార్డు ఇవ్వాలన్న ఒక్కొక్కరితో రూ.500 తీసుకుంటున్నారని ఏపీఓపై ఆరోపణలు గుప్పించారు. దీంతో టీడీపీ నాయకులు కూడా ఉద్యోగం వదిలేసిన వారికి జీతాలు ఎలా ఇస్తారని ఏపీఓను ప్రశ్నించారు. ఇది మంచి పద్ధతికాదని, మీపైన చాలా అభియోగాలు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోకపోతే ఇబ్బంది పడతారని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు.




ఏపీఓ నాగిరెడ్డిని నిలదీస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్

చెరువులు సీజ్..!

తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం

- భూగర్భ జలమట్టం పెంపునకు చర్యలు
- ఆయకట్టుకు నీరివ్వని వైనం
- పంటల సాగుకు రైతులు దూరం



చిలమత్తూరు చెరువు

తీవ్ర కరువు పరిస్థితుల నేపథ్యంలో చిలమత్తూరు మండలంలో తాగునీటి ఎద్దడికి చెక్ పెట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భూగర్భ జలమట్టాల పెంపు ద్వారా తాగునీటి సమస్యకు చెక్ పెట్టాలని నిర్ణయించారు. ఆ మేరకు చెరువుల నీటిని ఆయకట్టుకు వదలకుండా నిల్వ ఉంచారు. ఆ మేరకు చెరువు తూములను సీజ్ చేశారు. దీంతో ఆయకట్టు భూములు బీళ్లుగా మారిపోయాయి. రెండేళ్లుగా చెరువులను సీజ్ చేయడంతో భూగర్భ జలమట్టం గణనీయంగా పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. వర్షాలు కూడా సమృద్ధిగా కురుస్తుండడంతో తాగునీటి కొరత తీరిందని మండల వాసులు చెబుతున్నారు.

చిలమత్తూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కరువు పరిస్థితుల దృష్ట్యా మండలంలోని ఆయకట్టు చెరువులన్నింటినీ అధికారులు ముందస్తుగా సీజ్ చేశారు. అందులో ఉన్న నీటిని సాగు అవసరాలకు ఉపయోగించకుండా ఆపేశారు. తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. గతంలో తాగునీటి సమస్యలను దృష్టిలో ఉంచుకున్న ఇరిగేషన్ అధికారులు చెరువుల నుంచి నీటిని వదలకుండా పూర్తిగా సీజ్ చేశారు. ఒకట్రెండు చోట్ల సాగుకు వినియోగించాలని రైతులు ప్రయత్నించినా అధికారులు ససేమిరా అన్నారు. రెండేళ్ల క్రితం చెరువులన్నీ నిండి మరువలు పారాయి. చెరువుల తూములు సీజ్‌లో ఉండటం కారణంగా నీటిని పంటలకు వాడుకోలేకపోయారు. మండలంలో 14 చెరువులున్నాయి. వాటిలో 9 పెద్ద చెరువులు కాగా, 5 చిన్నవి. వీటి కింద 4420.72 ఎకరాల ఆయకట్టు సాగువుతుండేది. నీరివ్వకపోతే ఈ భూములన్నీ బీళ్లుగా మిగిలిపోయాయి.

రబీకి విడుదల చేస్తారా?


మండలంలో చిలమత్తూరు, పెక్కాలచెరువు, కోడూరు చెరువులు పెద్దవి. వీటి పరిధిలో సుమారు 1200 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. రెండేళ్లుగా వర్షాలు కురుస్తుండటంతో చెరువుల్లో నీటిమట్టాలు తగ్గడం లేదు. అధికారులు ముందస్తుగా తూములను సీజ్ చేశారు. దీంతో నీరు విడుదల కాక పంటలు సాగుచేసుకోలేకపోయారు. కోడూరు చెరువు నుంచి కొంతకాలం నీటిని విడుదల చేసినా పంట చేతికొచ్చే సమయానికి నీటి విడుదలను ఆపేశారు. అక్కడ తూము సీజ్‌లో ఉండటం కారణంగా చెరువు నీటిని వాడుకోలేకపోయారు. చిలమత్తూరు చెరువుని పూర్తిగా సీజ్ చేయడంతో ఎకరం కూడా సాగుకాలేదు. గతంలో జరిగిన విధంగానే ఈ ఏడాది రబీకి కూడా నీటి విడుదల ఉండదని అధికారులు ఖరాకండిగా చెబుతున్నారు. చెరువుల్లో నీరు నిల్వ ఉండటం కారణంగా భూగర్భజలాల మట్టం పెరిగి, తాగునీటి ఇబ్బందులు తప్పుతాయంటున్నారు. పంటల సాగు పేరుతో చెరువుల్లో నీటిని తోడేస్తే భవిష్యత్తులో తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెబుతున్నారు. దీని ప్రకారం ఈ రబీలో కూడా ఆయకట్టు సాగు ఉండదని స్పష్టంగా అర్థమవుతోంది.

చెరువులు నిండినా..

గతంలో చెరువు ఆయకట్టు కింద ఎకరం భూమి ఉంటే ఆ కుటుంబానికి ఏడాది పొడవునా తిండిగింజల సమస్య వచ్చేది కాదు. ఇప్పుడు భూమి ఉండి.. నీరు కూడా ఉన్నా తినేందుకు ధాన్యం పండించుకోలేని దుస్థితి రైతులు ఎదుర్కొంటున్నాంనను. చెరువులు నిండితే పంటలు సాగుచేసుకుందామని అనుకున్న రైతుల ఆశలు అడియాసలవుతున్నాయి. ఎక్కువ నీరు అవసరమయ్యే వరి కాకపోయినా ఇతర ఆరుతడి పంటలను సాగుచేసుకునేందుకైనా అవకాశం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పెరిగిన భూగర్భజల మట్టాలు

సాగు నీటి చెరువులను సీజ్ చేయడం కారణంగా మండలంలోని భూగర్భజల మట్టాలు పెరిగాయనే చెప్పవచ్చు. బోరుబావుల్లో పుష్కలంగా నీరు లభిస్తోంది. గతంలో 1000 అడుగులుపైగా బోరుబావులు తవ్వినా నీరు లభించేది కాదు. రెండేళ్లుగా భూగర్భజల మట్టాలు బాగానే పెరిగాయి. గ్రామాల్లో తాగునీటి బోర్లు వేసవిలో కూడా పనిచేస్తున్నాయి. చెరువుల సీజ్ కారణంగానే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీరిందని చెప్పవచ్చు.



బీళ్లుగా మారిన చిలమత్తూరు చెరువు ఆయకట్టు

తాగునీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకునే..

గత ఐదేళ్లలో వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండేది. దాంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడేవారు. బోరుబావులు వెయ్యి అడుగులు తవ్వినా నీరు దొరికేది కాదు. ఈ నేపథ్యంలో చెరువుల్లో నీటి నిల్వలు ఉంచాలని ప్రభుత్వం నిరయించింది. ఆ మేరకు రెండేళ్లుగా సాగునీటి చెరువులను సీజ్ చేశాం. దాంతో భూగర్భజల మట్టాలు వృద్ధి చెందాయి. గతంలో భూగర్భజల మట్టం 30 మీటర్ల లోతులో ఉండేది. అది ప్రస్తుతం 9 మీటర్లకు చేరుకుంది. ఫలితంగా బోరుబావుల్లో నీరు పుష్కలంగా లభిస్తోంది.

- నాగరత్న, నీటి పారుదల శాఖ జేఈ

అంగన్‌వాడీల ఆందోళన



కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీ కార్యకర్తలు

పుట్టపర్తి టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చాలని డిమాండ్ చేస్తూ శనివారం పుట్టపర్తిలో అంగన్‌వాడీలు కదం తొక్కారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వందలాదిమంది అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ ముట్టడించేందుకు యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. వీరికి సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మినీ అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ తమ సమస్యలను ప్రిన్సిపల్ సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లినా, ఇప్పటివరకు పరిష్కారం కాలేదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రధాన అంగన్‌వాడీ కార్యకర్తలతో సమానంగా మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడా రూ.15వేలు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమాన అవకాశాలకే ఉద్యమం

మూడు దశాబ్దాల పోరాటం విజయవంతం
అమరులు, నాయకులు, కార్యకర్తలకు అంకితం
మాదిగల ఆత్మీయ సదస్సులో మందకృష్ణ మాదిగ



మాదిగల ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న మందకృష్ణ

అనంతపురం సెంట్రల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో విజయం సాధించామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు, రాష్ట్రంలో ఏక సభ్య కమిషన్ ఏర్పాటు నేపథ్యంలో నగరంలోని లలిత కళాపరిషత్‌లో మాదిగల ఆత్మీయ సదస్సును శనివారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ, ఎస్సీ ఉపకులాలన్నింటికీ సమాన అవకాశాలు దక్కాలన్న ఆకాంక్షతో వర్గీకరణ ఉద్యమం చేశామని అన్నారు. ఈ ఉద్యమంలో అనేకమంది అమరులయ్యారని, లక్షలాదిమంది నాయకులు, కార్యకర్తలు శ్రమించారని అన్నారు. పోరాటాల ఫలితంగా సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని హర్షం వ్యక్తంచేశారు. ఎస్సీ వర్గీకరణను గతంలోనే చంద్రబాబు అమలు చేశారని, దీంతో అనేక మంది మాదిగలకు విద్య, ఉద్యోగ అవకాశాలు దక్కాయని అన్నారు. దీనికి వ్యతిరేకంగా మాలలు కోర్టుకెళ్లడంతో మళ్లీ ఉద్యమం చేపట్టాల్సి వచ్చిందని, చివరకు విజయం సాధించామని అన్నారు. ఈ విజయాన్ని మాలలు వ్యతిరేకించడం సరైందికాదని అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఏర్పాటైన కమిషన్లు ఎస్సీ వర్గీకరణ సరైందేనని నివేదికలు ఇచ్చాయని అన్నారు. రాష్ట్రపతులు, ప్రధానులు మాదిగల డిమాండ్ న్యాయమైదని అభిప్రాయపడ్డారని గుర్తుచేశారు.

స్వాగతిస్తున్నాం

ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని మందకృష్ణ మాదిగ అన్నారు. పదిరోజుల క్రితం ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు చెబుతున్నామని అన్నారు. కులం పేరు చెప్పుకోవడానికి ఒకప్పుడు సిగ్గుపడినవారు.. నేడు సగర్వంగా పేర్లకు ముందు, వెనకా మాదిగ అని పెట్టుకుంటున్నారని అన్నారు. ఇందుకు సహకరించిన న్యాయవ్యవస్థకు, ప్రధాని నరేంద్రమోదీకి, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలని అన్నారు.

తరలివచ్చిన మాదిగలు

ఆత్మీయ సదస్సుకు వివిధ ప్రాంతాల నుంచి మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించి, లలితాకళాపరిషత్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మందకృష్ణను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, శంకర్, ఎల్లప్ప, గంగాధర్, అమర్నాథ్, కదిరప్ప, రమేష్, ఆంజనేయులు, నాగేంద్ర నాథ్, స్వంత్రకుమారి, సునీత, ఉపాధ్యాయ సంఘం నాయులు పెద్దన్న, నాగభూషణం, నారాయణ, ఎస్కేయూ ఉద్యోగ సంఘం నాయకులు నారాయణ, సంజీవప్ప, దేవరాజు, లక్ష్మయ్య, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

హాజరైన మాదిగలు



తూంచెర్లలో నీట మునిగిన వరి పంట



వరిని ముంచిన వర్షం

అల్ప పీడనం కారణంగా కురిసిన వర్షాలు వరి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. కనగానపల్లి మండలంలో మూడు రోజులపాటు భారీ వర్షం కురిసింది. దీంతో కోత దశలో ఉన్న వరి పంటలు నీట మునిగాయి. తూంచెర్ల గ్రామానికి చెందిన రైతులు నాగార్జున, చిట్రా నారాయణస్వామి, జయరాములు, తిమ్మయ్య సాగు చేసిన వరి పంట కోత దశలో ఉంది. భారీ వర్షానికి పైరు మొత్తం నేలకొరిగింది. తూంచెర్లలో సుమారు వంద ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, కనగానపల్లి

కొత్త జీపు.. పాత జ్ఞాపకాలు



జీపు నడుపుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి కొత్త జీపుపై సరదాగా విహరించారు. హైదరాబాద్ నుంచి తెచ్చిన అధునాతన జీపును శనివారం ఆయన సరదాగా నడిపారు. ఇంటి చుట్టూ, మైదానంలో విహరిస్తూ.. పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జేసీ ప్రభాకర్ విహారాన్ని ఆయన అనుచరవర్గం ఆనందంగా వీక్షించింది.

దర్జాగా...

- సరిహద్దు దాటుతున్న చౌక బియ్యం
- కర్ణాటకకు తరలుతున్న వందల క్వింటాళ్లు



ఇటీవల కుందుర్పి మండలంలో ఆటోల్లో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు (ఫైల్)

కళ్యాణదుర్గం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం మీదుగా ప్రతిరోజు వందల క్వింటాళ్ల చౌకధరల ధాన్యపు డిపో బియ్యాన్ని సరిహద్దులు దాటించేస్తున్నారు. ఈ బియ్యానికి కర్ణాటక రాష్ట్రంలో మంచి ధర, డిమాండ్ ఉండటంతో అక్రమ రవాణా ఎక్కువగా సాగుతోంది. జిల్లా సరిహద్దు ప్రాంతాలైన కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా సాగుతోంది. అక్రమార్కులు తొలుత ఇక్కడ కిలో రూ. 10లకు బియ్యం సేకరించి నిల్వ చేస్తారు. తర్వాత రాత్రికి రాత్రే ఆ నిల్వలను సరిహద్దులు దాటిస్తున్నారు. కర్ణాటకలో కిలో రూ. 20లు నుంచి రూ.25ల వరకు విక్రయిస్తున్నారు. దీనికితోడు వాటిని అక్కడే పాలిష్ చేయించి కిలో రూ. 30 నుంచి రూ. 40 లు వరకు అమ్ముతున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా లాభసాటిగా ఉండటంతో పలువురు అక్రమార్కులు విచ్చలవిడిగా దీన్ని కొనసాగిస్తున్నారు. అప్పుడప్పుడు విజిలెన్స్ పోలీసుల దాడుల్లో పట్టుబడుతున్నా ఈ బియ్యం అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు.

అక్రమ రవాణా సాగుతోందిలా..

ఉరవకొండ నుంచి కళ్యాణదుర్గం మీదుగా కంబదూరును దాటుకుని కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోకి యథేచ్ఛగా అక్రమ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఎక్కువగా ఉరవకొండ, కళ్యాణదుర్గం ప్రాంతాల నుంచే రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. బొలెరో, ఆటోల్లో ఈ రవాణా సాగుతోంది. తెల్లవారుజాము సమయాల్లోనే ఈ అక్రమ రవాణా సాగుతున్నట్లు సమాచారం. కర్ణాటకకు వెళ్లే మార్గంలో కళ్యాణదుర్గం, కంబదూరు పోలీస్‌స్టేషన్లు ఉన్నప్పటికి అక్రమార్కులు భయపడటం లేదు. పోలీసుల కళ్లుగప్పి సరిహద్దు దాటించేస్తున్నారు. పోలీసులు దాడులు చేసి పట్టుకున్నా వారిలో ఏ మాత్రం భయం కలగడం లేదు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలు కర్ణాటక సరిహద్దు ప్రాంతానికి కేవలం మూడు కిలోమీటర్ల పరిధిలోనే ఉన్నాయి. దీంతో ఎక్కువగా అక్రమ రవాణా సాగుతోంది. కళ్యాణదుర్గం మండలం మోరేపల్లి, కొత్తూరు అటవీశాఖ దారి వెంబడి వెళ్లి, అక్కడి నుంచి కుందుర్పి మండలం బెస్తరపల్లికి వెళ్లి కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోకి ప్రవేశిస్తున్నట్లు సమాచారం. ఈ తతంగం గత కొన్నేళ్ల నుంచి సాగుతున్నా అధికారులు అరికట్టలేకపోతున్నారు.

ప్రత్యేక నిఘా వేశాం



స్టోర్ బియ్యం అక్రమ రవాణాపై మా సిబ్బందితో పూర్తిస్థాయిలో నిఘా వేశాం. కళ్యాణదుర్గం రూరల్, కళ్యాణదుర్గం టౌన్ పరిధిలో ఉన్న పోలీసులు కూడా వీటిపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దాంతో పాటు కర్ణాటక సరిహద్దు మండలాల్లో ఉన్న పోలీస్‌స్టేషన్లను కూడా అప్రమత్తం చేశాం.

- రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

కూలిన పెన్నా వంతెన

రాకపోకలకు ఇబ్బందులు





ఒక వైపు నుంచి ప్రమాదకరంగా వెళ్తున్న వాహనాలు

మట్టిరోడ్డును ధ్వంసం చేసిన దృశ్యం

హిందూపురం అర్బన్, నవంబరు 16: (ఆంధ్రజ్యోతి): హిందూపురం-పోచనపల్లి మధ్య పెన్నానది వంతెన శనివారం తెల్లవారుజామున కూలిపోయింది. పురాతన వంతెన కావడంతో కాలం చెల్లింది. భారీ వాహనాలు వంతెనపై ప్రయాణించడంతో కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల ఇసుక ట్రాక్టర్‌లు, టిప్పర్‌లు, బియ్యం వాహనాలు, కంకర టిప్పర్‌లు ఈ వంతెన మీదుగా వెళుతున్నాయి. కర్ణాటకకు అక్రమ రవాణా ఈ మార్గంలోనే సాగుతోంది. 2022లో కురిసిన భారీ వర్షాలకు పెన్నానది వంతెన కూలిపోయింది. దీంతో అటువైపు ఉన్న దాదాపు పది గ్రామాలకు, కర్ణాటకకు రాకపోకలు నిలిచిపోయాయి. తప్పనిసరి అనుకుంటే 25 కి.మీ. చుట్టేసుకుని సేవామందిరం మీదుగా ప్రయాణించాల్సి వచ్చింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.10 లక్షలతో తాత్కాలికంగా ఐరన్ వంతెనను నిర్మించారు. ఇది పాదచారులకు మాత్రమే ఉపయోగపడేది. అంబులెన్స్ వంటివి రాలేకపోయాయి. ఆ తరువాత రూ.80 లక్షలతో 10 మీటర్లు వరకు వంతెనను పునర్నిర్మించారు. ఇంతలోనే పోచనపల్లి వైపు ఉన్న వంతెన కూలిపోయింది. ప్రస్తుతం వంతెనపై ట్రాక్టర్ పట్టేంత మార్గం మాత్రమే ఉంది. అది కూడా ఎప్పుడు కూలుతుందోనని జనం భయపడుతున్నారు. కూలిన వంతెన కింద భాగంలో భారీగా తొర్ర పడింది. భారీ వాహనాలు వస్తే అదికూడా కూలిపోయేలా ఉంది. దీంతో పోచనపల్లి యువకులు ఆ ప్రాంతంలో ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. మరోవైపు పెన్నాలో మట్టిరోడ్డును కొందరు ధ్వంసం చేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

ప్రతిపాదనలు పంపాము..

పెన్నా నదితో వంతెన కూలింది. వంతెన పునర్నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపాము. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే టెండర్ పిలుస్తాము. పనులను త్వరగా చేపట్టేందుకు ప్రయత్నిస్తాం. తాజా పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేశాము.

- మోహన్‌బాబు, ఏఈ ఆర్ అండ్ బీ

క్షుద్రం.. వజ్రం..!

నిత్యం వివాదాలు.. మోసాలు
వజ్ర భాస్కర్ రెడ్డి తీరుపై విమర్శలు

కదిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు వజ్ర భాస్కర్ రెడ్డి క్షుద్రపూజలు చేస్తూ పోలీసులకు పట్టుబడటం జిల్లాలో కలకలం రేపుతోంది. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట అటవీ ప్రాంతంలోని ఓ పురాతన ఆలయంలో క్షుద్రపూజలు చేస్తుండగా ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న వజ్రభాస్కర్ రెడ్డి పలు పార్టీలను మారారు. నమ్ముకున్న కార్యకర్తలను నట్టేట ముంచడం ఆయనకు అలవాటని స్థానికులు విమర్శిస్తున్నారు. వజ్ర భాస్కర్‌రెడ్డి 2019లో కదిరి వైసీపీ టిక్కెట్ ఆశించారు. దక్కకపోవడంతో మరో పార్టీనుంచి పోటీ చేశారు. ఆ తరువాత బీజేపీలో చేరారు. 2024 ఎన్నికలకు ముందు తిరిగి వైసీపీలో చేరారు. బీజేపీలో ఉండగా మహిళా కార్యకర్తలకు స్థలం ఇస్తానని నమ్మించారు. ఇవ్వకుండా మోసగించారు. దీంతో బాధిత మహిళలు ఆయన కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రియల్ వ్యాపారం చేసే వజ్ర భాస్కర్ రెడ్డి.. కొత్త బైపాస్ రోడ్డుకు సమీపంలో ప్లాట్లు వేశారు. తనకు చెందిన రెండు సర్వే నంబర్ల మధ్యలో ఉన్న 33 సెంట్ల ప్రభుత్వ భూమిని కలుపుకున్నారు. ప్రభుత్వ భూమిలో రోడ్లు వేసి, తన భూమిలో ప్లాట్లు వేసుకున్నారు. ప్రభుత్వ భూమి విలువ ఒకటిన్నర కోటి ఉంటుంది.

అందరూ అంతేనా..!

రియల్ మోసాలు, ప్రభుత్వ భూముల కబ్జా, ప్రజలను మోసం చేయడం వంటి అనేక కేసుల్లో కదిరికి చెందిన పలువురు వైసీపీ నాయకులు నిందితులుగా ఉన్నారు. తలుపుల ఉప సర్పంచ్ డి. క్రిష్టారెడ్డి, అలియాస్ డికీ బాబు ఓ టీచర్‌ను మోసగించి జైలుపాలయ్యారు. వివిధ ప్రాంతాల్లో రైస్ పుల్లింగ్ పేరిట మోసాలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఇదే మండలానికి చెందిన వజ్రభాస్కర్ రెడ్డి క్షుద్ర పూజలు చేస్తూ పట్టుబడ్డారు.



వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తో వజ్ర భాస్కర్‌రెడ్డి (ఫైల్)

బ్రేక్..!

ప్రైవేటు ఏజెన్సీలో ఫిట్‌నెస్ పరీక్షలు తాత్కాలికంగా నిలిపివేత

ఆర్థిక శాఖ అనుమతులు లేకపోవడమే కారణం

వైసీపీ సర్కార్‌లో టెండర్లు ఖరారు

పారదర్శకతపై సర్వత్రా అనుమానాలు..



శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ టెస్టింగ్ కేంద్రం

అనంతపురం అర్బన్ నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అనంతలో ప్రైవేటు ఏజెన్సీలో వాహనాల ఫిట్‌నెట్ పరీక్షలకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఆర్థిక శాఖ అనుమతులు లేకపోవడంతోనే నిలుపుదల చేసినట్లు సమాచారం. వైసీపీ సర్కార్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా వాహనాల ఫిట్ నెట్ పరీక్షల నిర్వహణ కోసం టెండర్లు ఖరారు చేశారు. అయితే సార్వత్రిక ఎన్నికల సమయంలో టెండర్లు దక్కించుకున్న సంస్థలకు బాధ్యతలు అప్పగించలేదు. ఎన్నికల తర్వాత ఈ ఏడాది సెప్టెంబరు ఆరంభం నుంచి జిల్లాలో శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్‌కు ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఏఎఫ్ఎంఎస్) నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. జాతీయరహదారిలోని హైదరాబాద్ చెఫ్స్ ఎదురుగా రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పరిధిలో అయ్యవారిపల్లికి వెళ్లే దారిలో ఫిట్ నెస్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రైవేటు కేంద్రంలోనే వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు.

పారదర్శకతపై అనుమానాలు

వైసీపీ హయాంలో వాహనాల ఫిట్‌నెట్ పరీక్షల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు ఖరారు చేశారు. అయితే ఇది పారదర్శకంగా జరిగిందో లేదోనన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పదేళ్ల వరకు నిర్వహణ కోసం టెండర్లు ఖరారు చేసినట్లు సమాచారం. అయితే కూటమి ప్రభుత్వం ఈ విధానంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా అనంత జిల్లాతోపాటు మరో రెండు జిల్లాల్లో మాత్రమే ఇప్పటి దాకా ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మిగిలిన జిల్లాల్లో ఇంకా ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఓపెన్‌లోని కేంద్రాల్లో ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణపైనా ప్రభుత్వం దృష్టి సారించాలన్న యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఆర్థిక శాఖ అనుమతులు లేవన్న కారణంతోనే ప్రైవేటు సంస్థల్లో నిర్వహిస్తున్న వాహనాల ఫిట్‌నెస్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు తెలిసింది.

అప్పటి దాకా ఆర్టీఏ ఆఫీస్‌ల్లోనే పరీక్షలు

జిల్లా కేంద్రం సమీపంలోని ప్రైవేటు ఏజెన్సీలో ఫిట్‌నెస్ పరీక్షలను తాత్కాలికంగా నిలుపుదల చేసిన నేపథ్యంలో పాత పద్ధతిలో అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం ఆర్టీఏ కార్యాలయ పరిధిల్లోని అన్ని రకాల వాహనాలకు ఫిట్ నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు ఏజెన్సీకి ఫిట్‌నెస్ పరీక్షల బాధ్యత అప్పగించినప్పటి నుంచి జిల్లాలోని అన్ని ప్రాంతాల వాహనాలు తప్పని సరిగా జిల్లా కేంద్రం సమీపంలోని శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీ కేంద్రానికి వచ్చేవి. గత వారం రోజులుగా అక్కడ ఫిట్‌నెస్ పరీక్షలు బంద్ చేయడంతో తిరిగి ఆర్టీఏ కార్యాలయాల్లోనే ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి తదుపరి నిర్ణయం వచ్చే దాకా ఆర్టీఏ కార్యాలయాల్లోనే వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు కొనసాగుతాయి.



అనంత ఆర్టీఏ కార్యాలయంలో ఫిట్‌నెస్ పరీక్షల కోసం నిలిపిన వాహనాలు

తాత్కాలికంగా బంద్: వీర్రాజు, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి

పలు కారణాల నేపథ్యంలో ప్రైవేటు ఏజెన్సీలో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహణను ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసింది. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే దాకా ఆర్టీఏ కార్యాలయాల్లోనే యథాతథంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తాం. అప్పటి దాకా ప్రైవేటు ఏజెన్సీకి బదులుగా పాత పద్ధతిలో వాహన్ సైట్‌లో ఫిట్‌నెస్ పరీక్షల కోసం చలానాలు కట్టాలి. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలి.

న్యూస్ బాక్స్

సత్యసాయి జయంతికి వంద బస్సులు

ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్

పుట్టపర్తి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతిని పురస్కరించుకుని పుట్టపర్తి నుంచి వివిధ ప్రాంతాలకు వంద ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు ఆర్ఎం(రీజినల్ మేనేజర్) మధుసూదన్ తెలిపారు. ఈనెల 22నుంచి 25 వరకు ఈబస్సు సర్వీసులు నడుస్తాయన్నారు. పుట్టపర్తి రైల్వేస్టేషన్ నుంచి పట్టణంలోకి 22నుంచి 24వరకు మూడురోజులపాటూ రోజుకు పది సర్వీసులు నిరంతరం తిరుగుతాయన్నారు. అలాగే 22, 23 తేదీల్లో హిందూపురం వయా పెనుకొండ మీదుగా ఐదు బస్సు సర్వీసులు తిరుగుతాయన్నారు. హిందూపురం వయా గోరంట్ల మీదుగా 22 నుంచి 24 వరకు మూడు రోజులపాటు పది సర్వీసులు తిరుగుతాయన్నారు. 23, 24 తేదీల్లో కదిరి వయా నల్లమాడ మీదుగా పుట్టపర్తికి ప్రతిరోజు ఐదు బస్సులు తిరుగుతాయన్నారు. 22నుంచి 24 వరకు ధర్మవరం రైల్వేస్టేషన్ నుంచి పుట్టపర్తికి 12 బస్సులు తిరుగుతాయన్నారు. అనంతపురం నుంచి పుట్టపర్తికి 22 నుంచి 24వరకు మూడు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. చెన్నై నుంచి కూడా పుట్టపర్తికి బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. బెంగళూరు, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్‌లనుంచి పుట్టపర్తికి 22నుంచి 24వరు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. భక్తుల రద్దీని బట్టి మరిన్నిసర్వీసులు నడుపుతామన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారిణి నిర్మలజ్యోతి

పుట్టపర్తిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారిణి నిర్మలజ్యోతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 24లోపు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి కార్యాలయం (శ్రీసత్యసాయిజిల్లా)లో అందచేయాలని పేర్కొన్నారు. బీసీల్లో 66శాతం, ఎస్సీల్లో 20శాతం, ఎస్టీల్లో 14శాతం మందిని రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైనవారికి గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదోతరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో జిల్లాకేంద్రంలోని దీనజనోద్ధరణ భవన సముదాయంలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం (శ్రీసత్యసాయిజిల్లా)లో దరఖాస్తులందచేయాలన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్షలోపు ఉండాలన్నారు. వివరాలకు నేరుగా కార్యాలయంలో కాని ఫోన్ నెంబరు 9393141545లోగానీ సంప్రదించాలని తెలిపారు.

నారా రామ్మూర్తినాయుడు మృతికి సంతాపం

అనంతపురం అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడి మృతిపై జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తమ సంతాపాన్ని తెలియజేశారు. చంద్రగిరి నియోజకవర్గం, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

ఇర్ఫాన్ సేఫ్

కొయ్యను బయటకు తీసిన వైద్యులు



బాలుడి శరీరం నుంచి బయటకు తీసిన కొయ్య

కణేకల్లు, నవంబరు 16(ఆంధ్ర జ్యోతి): రేగు చెట్టు నుంచి పడి.. నడుములోకి కొయ్య దూసుకెళ్లిన బాలుడు ఇర్ఫాన్.. సురక్షితంగా బయటపడ్డాడు. బాలుడి శరీరం నుంచి కొయ్యను కర్నూలు వైద్యులు విజయవంతంగా బయటకు తీశారు. కణేకల్లు తహసీల్దారు కార్యాలయం వద్ద రేగు చెట్టు మీద నుంచి ఇర్ఫాన్ శుక్రవారం కింద పడిన విషయం తెలిసిందే. బాలుడి నడుము భాగంలోకి కొయ్య దూసుకెళ్లడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. కర్నూలు వైద్యులు శస్త్ర చికిత్స చేసి ఇర్ఫాన్ నడుములో ఇరుక్కున్న కొయ్యను బయటకు తీశారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి బాగుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

క్రైం కార్నర్

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


మృతి చెందిన యోగేంద్రరెడ్డి

అనంతపురం క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో ఇంజనీరింగ్ చదివిన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతపురం రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన తాతిరెడ్డి యోగేంద్ర రెడ్డి(28) ఇంజనీరింగ్ చదివాడు. మూడు సంవత్సరాలుగా ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. ఉద్యోగం ఇకరాదని మనస్తాపానికి గురైన యోగేంద్రరెడ్డి శనివారం సోముల దొడ్డి రైల్వేలైన్ నుంచి తాటిచెర్ల రైల్వేలైన్ మధ్యలో ట్రాక్ పక్కనున్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాతి రెడ్డి దంపతులకు కొడుకు, కుమార్తె సంతానం. ఒక్కగానొక్క కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

బత్తలపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని మండల కేంద్రమైన బత్తలపల్లిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన మేరకు.. బత్తలపల్లి-అనంతపురం రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అనిల్‌కుమార్ (32) అనే యువకుడు మృతి చెందాడు. ఆదోనికి చెందిన నిత్యానంద్ కుమారుడు అనిల్‌కుమార్ పది రోజుల నుంచి కనిపించలేదు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం వాహనదారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి చేతుల మీద ఉన్న పచ్చబొట్టు ఆధారంగా సామాజిక మాధ్యమాల్లో ఫొటోలను పంపించారు. విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

న్యూస్ బాక్స్

మార్కెట్‌కు మరింత తగ్గిన టమోటాల రాక

అనంతపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు వారంరోజులుగా టమోటా ఉత్పత్తులు రావడం తగ్గుతూ వస్తోంది. శనివారం భారీగా తగ్గాయి. 450 టన్నులు మాత్రమే వచ్చాయి. అయితే ధరల్లో మాత్రం ఎలాంటి వ్యత్యాసం కనిపించడం లేదు. కిలో టమోటా గరిష్ఠంగా రూ. 23తో అమ్ముడుపోగా, సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు.

చీనీ టన్ను రూ.29 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ. 29,300 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 15,300, సరాసరి రూ. 20వేలుతో అమ్ముడు పోయినట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 34 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

1.578 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.578 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శనివారం తెలిపారు. అలాగే ఇన్‌ఫ్లో 1104 క్యూసెక్కులు ఉండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 983 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

రేపు రాష్ట్రస్థాయి కనకదాస జయంత్యుత్సవం

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లాలో రాష్ట్రస్థాయి కనకదాస జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ డీడీ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె స్పష్టం చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు నగరంలోని గుత్తిరోడ్డులో ఉన్న కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తారని తెలిపారు. అనంతరం కేటీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. వేడుకలకు జిల్లాలోని ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

22 మండలాల్లో వర్షం



అనంతపురం అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 22 మండలాల్లో శుక్రవారం వర్షం కురిసింది. అత్యధికంగా ఆత్మకూరు 30.0 మి.మీ వర్షపాతం నమోదైంది. బ్రహ్మసముద్రం 11.2, రాప్తాడు 11.0, గుంతకల్లు 10.2, కంబదూరు 9.8, కణేకల్లు 9.6, యల్లనూరు 8.6, రాయదుర్గం, బుక్కరాయసముద్రం 7.2, శెట్టూరు 6.8, పెద్దపప్పూరు, బెళుగుప్ప 6.2 మి.మీ నమోదైంది. మిగతా మండలాల్లో 5.4 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

కుడి.. ఎడం..!



- పీఏబీఆర్ కుడి కాలువలో పారని నీరు
- నీరు లేక వెలవెలబోతున్న చెరువులు
- వేసవిలో కష్టమవుతుందంటున్న రైతులు


నీరు లేక ఎండిపోయిన బొమ్మేపర్తి చెరువు

రాప్తాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువ నీటి కోసం పలు గ్రామాల రైతులు ఎదురుచూస్తున్నారు. నీరు లేక ఆయా గ్రామాల చెరువులు వెలవెల బోతున్నాయి. ఏటా నవంబరులో పీఏబీఆర్ కుడి కాలువకు నీరు విడుదల చేసేవారు. వచ్చే నీటితో కాలువ పరిధిలోని చెరువులను నింపేవారు. అయితే ఈ ఏడాది అధికారులు కుడి కాలువకు నీరు విడుదల చేయకపోవడంతో దాని పరిధిలోని గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది చెరువులకు నీరు సరఫరా కాకపోతే వేసవిలో తాగు, సాగు నీటి బోర్లలో భూగర్భ జలాలు అడుగంటుతాయని


గొందిరెడ్డిపల్లి చెరువులో అడుగంటిన నీరు

ఆందోళన చెందుతున్నారు. పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా 49 చెరువుకు నీరు చేరుతుంది. రాప్తాడు మండలంలో బొమ్మేపర్తి, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, లింగనపల్లి, ఎం. చెర్లోపల్లి, మరూరు, గొల్లపల్లి, హంపాపురం -1, హంపాపురం-2, చెరువులకు పీఏబీఆర్ నుంచి నీరు సరఫరా అవుతుంది.

వర్షానికి నిండిన కొన్ని చెరువులు

ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండలంలోని కొన్ని చెరువులు నీటితో నిండాయి. బుక్కచెర్ల చెరువుకు హంద్రీనీవా నీరు సరఫరా అవడంతో పాటూ వర్షపు నీరు తోడవ్వడంతో మరువ పారింది. యర్రగుంట, పుల్లలరేవు చెరువులు భారీ వర్షానికి నిండిపోయాయి. మిగతా చెరువుల్లో నీరు లేక రైతుల ఎదురుచూస్తే పరిస్థితి నెలకొంది. మండలంలోని గొందిరెడ్డిపల్లి చెరువు నిండి మరువ పారితే ఆ నీరు బొమ్మేపర్తి, లింగనపల్లి చెరువులకు సరఫరా అవుతాయి. అయితే గొందిరెడ్డిపల్లి చెరువులో గుంతల్లో మాత్రమే నీరు ఉంది. బొమ్మేపర్తి, లింగనపల్లి చెరువుల్లో చుక్క నీరు కూడా లేదు. అలాగే హంపాపురం-1, హంపాపురం-2 చెరువులు, గొల్లపల్లి చెరువులు నీరు లేక ఎండిపోయాయి. ఎం. చెర్లోపల్లి, మరూరు చెరువుల్లో 50 శాతం వర్షపు నీరు ఉంది. పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా చెరువుకు నీరు సరఫరా కాకపోతే బోరుబావుల్లో నీటి మట్టం తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పీఏబీఆర్ కుడి కాలువకు నీరు విడుదల చేసి పూర్తి స్థాయిలో చెరువులు నింపాలని రైతులు కోరుతున్నారు.

బోర్లలో నీరు తగ్గుతాయి



ప్రస్తుతం బొమ్మేపర్తి చెరువులో చుక్క నీరు కూడా లేదు. గొందిరెడ్డిపల్లి చెరువు మరువ పారితేనే మా ఊరి చెరువుకు నీరు సరఫరా అవుతాయి. మా ఊరి చెరువు నిండిన తరువాతే లింగనపల్లి చెరువుకు నీరు సరఫరా అవుతాయి. కుడి కాలువ నీరు సరఫరా కాకపోతే వేసవితో బోర్లలో నీరు తగ్గుతాయి.
- లింగప్ప రైతు బొమ్మేపర్తి

చెరువులు నింపాలి



గొందిరెడ్డిపల్లి చెరువులో గుంతల్లో మాత్రమే నీరు ఉన్నాయి. రబీ సీజన్ ప్రారంభం కావడంతో చెరువులో నీరు త్వరగా ఇంకిపోయే అవకాశం ఉంది. కుడి కాలువకు నీరు విడుదల చేసి, చెరువులు పూర్తి స్థాయిలో నీటితో నింపితే మరో ఏడాది కాలం తాగు, సాగు నీటికి కొరత ఉండదు.
- ఉజ్జన్న రైతు గొందిరెడ్డిపల్లి

వైసీపీ నాయకుడిని విచారించిన పోలీసులు

హిందూపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్‌ను పోలీసులు పిలిపించి విచారించారు. వన్‌టౌన్ పోలీసులు శనివారం సాయంత్రం స్టేషన్‌కు తీసుకొచ్చి అతడి సెల్‌ఫోన్‌లో సోషల్‌మీడియాను పరిశీలించారు. గత వైసీపీ హయాంలో ఇతను టీడీపీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు చేసినట్లు పోలీసులకు సమాచారం రావడంతో అతన్ని స్టేషన్‌కు రప్పించి విచారణ చేశారు. అయితే జూన్ 4 తరువాత ఎలాంటి పోస్టులు చేయకపోవడంతో వదిలేశారు. అతడితోపాటు అతడి అనుచరులెవరైనా పోస్ట్ చేసినా అతడిదే బాధ్యత అని హెచ్చరించి వదిలేసినట్లు సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు.

బీజేపీ కార్యకర్తపై హత్యాయత్నం

- పరిస్థితి విషమం

బొమ్మనహాళ్, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరి గ్రామంలో శనివారం రాత్రి బీజేపీ కార్యకర్త కృష్ణమూర్తిశెట్టి (55)పై హత్యాయత్నం జరిగింది. వేట కొడవలితో కృష్ణమూర్తిశెట్టి చెయ్యి, వీపు, తలపై నరికారు. ఇంట్లో ఉన్న బాధితుడి చెల్లెలు పుష్పావతి బయటకు వచ్చి కేకలు వేయడంతో దాడికి పాల్పడిన వ్యక్తి పరారయ్యాడు. కొన ఊపిరితో ఉన్న కృష్ణమూర్తిని బళ్లారి విమ్స్‌కు తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉంది. బొమ్మనహాళ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. గ్రామస్థులు తెలిపిన మేరకు కృష్ణమూర్తిశెట్టి ఆయన చెల్లెలు పుష్పావతి (ఇద్దరూ అవివాహితులే) గ్రామంలో నివసిస్తున్నారు. రాత్రి కృష్ణమూర్తిశెట్టి భోజనం తింటుండగా ఆకస్మాత్తుగా అతడిని వేట కొడవలితో నరికినట్లు తెలిపారు. అతడి చెల్లెలు కేకలు విని తాము అక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు. కృష్ణమూర్తిశెట్టికి కురువల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో భూ తగాదా ఉందని, ఆ నేపథ్యంలోనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. తొందరలోనే దాడికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తామని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు.

22 నుంచి రాష్ట్రస్థాయి అంధుల అథ్లెటిక్స్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంధుల రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలు 22, 23వ తేదీల్లో అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఏపీ అంధుల క్రీడా సంఘం కార్యదర్శి రఘుకుమార్ తెలిపారు. పోటీలలో పురుషులకు 100మీటర్ల నుంచి 5వేల మీటర్ల పరుగు పోటీలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్ పోటీలు ఉంటాయన్నారు. మహిళలకు 100మీటర్ల నుంచి 1500మీటర్ల వరకు పరుగు పోటీలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో విజేతలు డిసెంబరు 13వ తేదీ నుంచి గుజరాత్‌లో ఇండియన్ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000878080, 9391045655 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

అనంతపురం సెంట్రల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓఎంసీఏపీ, ఎస్ఎం కేర్ సంయుక్తాధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శనివారం డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆఫీసర్ ప్రతాపరెడ్డి తెలిపారు. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులన్నారు. జీఎన్ఎం విద్యార్థులు రెండు, బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు మూడు సంవత్సరాలు అనుభవం ఉండాలని తెలిపారు. ఈనెల 27వరకు రిజిస్ట్రేషన్ గడువు ఉంటుందని, డిసెంబరు 1 నుంచి ఆరునెలల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. శిక్షణా కాషన్ డిపాజిట్ రూ.75వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.2.33 లక్షల నుంచి రూ.3.26లక్షల వరకు నెల జీతం ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వీసా ఫీజు, రానుపోను విమాన టికెట్లు ఎస్ఎం కేర్ సొల్యూషన్స్ చెల్లిస్తుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు https://forms.gle/4ZFuigtBSwXPUMgY8,skillinternational@apssdc.in మెయిల్‌కు రెస్యూమ్‌ను పంపాలని సూచించారు. వివరాలకు 9988853335 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గాయపడ్డ ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

- మృతదేహంతో విద్యార్థి సంఘాలు, బంధువులు నిరసన
- కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్

హిందూపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సహ విద్యార్థుల దాడిలో గాయపడిన విద్యార్థి ప్రేమ్‌సాయి మృతి చెందాడు. దీంతో బాధ్యులను కఠినంగా శిక్షించి, కళాశాల గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. హిందూపురంలోని బెంగళూరు రోడ్డులో నివాసమున్న శ్రీనివాసులు కుమారుడు ప్రేమ్‌సాయి(19) పుట్టపర్తిలోని ప్రైవేట్ కళాశాలలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉండేవాడు. ఈ నెల 13న అదే కళాశాలలో కొంతమంది విద్యార్థులు అతడిపై దాడి చేసి, గాయపరిచారు. నొప్పి తట్టుకోలేక ప్రేమ్‌సాయి అదేరోజు సాయంత్రం ఇంటికి వచ్చేశాడు. మరుసటి రోజు చెవి నొప్పి అధికం కావడంతో తల్లిదండ్రులు అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిం


రోదిస్తున్న ప్రేమ్‌సాయి తల్లి


మృతదేహంతో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు, మృతుడి బంధువులు

చారు. అయితే కడుపునొప్పి, చెవినొప్పి అధికం కావడంతో ఈనెల 15న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు పోస్టుమార్టం నిర్వహించవద్దని అడ్డుకున్నారు. అయితే పోలీసులు వారికి నచ్చజెప్పి పోస్టుమార్టం పూర్తి చేయించారు. కానీ మృతదేహాన్ని పుట్టపర్తిలోని కళాశాల వద్దకు తీసుకెళ్లి ధర్నా చేయడానికి కుటుంబసభ్యులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రయత్నించారు. టూటౌన్ సీఐ కరీం, వన్‌టౌన్ ఎస్ఐ శ్రీధర్ వారిని అడ్డుకున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోనే వారు మృతదేహంతో నిరసన తెలిపారు. విద్యార్థి బంధువులు మాట్లాడుతూ ప్రేమ్‌సాయిపై కొంతమంది విద్యార్థులు దాడి చేసి చంపేశారని, అయినా కళాశాల యాజమాన్యం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన విషయాన్ని కూడా తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంటికి పంపడం కళాశాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రేమ్‌సాయి మృతికి కారకులైన విద్యార్థులను శిక్షించాలని పోలీసులను కోరారు. కళాశాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరీక్షల్లో చూశారనే గొడవ..!

- విద్యార్థి మృతిపై పోలీసు విచారణ
- పోలీసుల అదుపులో ఇద్దరు విద్యార్థులు

పుట్టపర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న కళాశాలలో నిర్వహించిన పరీక్షల్లో వెనుక ఉన్న విద్యార్థి ప్రేమ్‌సాయి పేపరులోకి తొంగి చూసినట్లు తెలుస్తోంది. తన పేపరులో ఎందుకు చూస్తున్నావని ప్రేమ్ సాయి ప్రశ్నించగా మాటామాటా పెరిగింది. దీంతో అతడు కళాశాల లెక్చరర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై ఆగ్రహించిన ఇద్దరు తోటి విద్యార్థులు మాపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ కళాశాల క్యాంపస్‌లోనే ప్రేమ్‌సాయిపై దాడి చేశారు. ఈక్రమంలో అతడి చెవిపై దెబ్బలు పడినట్లు తెలిసింది. అనంతరం హాస్టల్‌కు వెళ్లిన ప్రేమసాయి తనకు చెవి నొప్పి తీవ్రంగా ఉందని చెప్పి హిందూపురానికి వెళ్లాడు. చెవినొప్పితో శుక్రవారం హిందూపురంలో ఈఎన్‌టీ వైద్యుడి వద్దకు వెళ్లారు. ఈ సందర్భంలో తనపై దాడి జరిగిన తీరు ఆ విద్యార్థి తన తల్లిదండ్రులకు చెప్పినట్లు తెలుస్తోంది. ప్రేమ్‌సాయిపై దాడి చేసిన ఇద్దరు విద్యార్థులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. చెవిపై గట్టిగా కొట్టడంతోనే రెండు రోజుల తరువాత విద్యార్థి మృతి చెందినట్లు ప్రాథమిక నిర్ధారణకు పోలీసులు వచ్చినట్లు తెలుస్తోంది.

పోలీసుల విచారణ

ఇంజనీరింగ్ కళాశాలలో తోటి విద్యార్థుల దాడిలో గాయపడి మృతి చెందిన బీటెక్ విద్యార్థి ప్రేమ్‌సాయి కేసును పోలీసులు విచారణ చేపట్టారు. పుట్టపర్తి సమీపంలోని


కళాశాల వద్ద పుట్టపర్తి అర్బన్ సీఐ సునీతతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఇంజనీరింగ్ కళాశాలకు అర్బన్ సీఐ సునీత తన సిబ్బందితో శనివారం వెళ్లి ఘటనపై ఆరా తీశారు. ప్రేమ్‌సాయిని ఇంజనీరింగ్ కళాశాలలో చదివే తోటి విద్యార్థులు కొట్టడంతో చెవికి తీవ్రగాయం కావడం, ఆపై యాజమాన్యం నిర్లక్ష్యంతోనే తన కుమారుడు మృతి చెందినట్లు ప్రేమ్‌సాయి తండ్రి శ్రీనివాసులు హిందూపురం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో కళాశాలకు వెళ్లి విద్యార్థి మృతిపై ప్రాథమిక విచారణ చేపట్టినట్లు పుట్టపర్తి అర్బన్ సీఐ సునీత వెల్లడించారు.

పంటి నొప్పి కారణంగా ఇంటికి వెళ్తున్నానని, అనుమతి ఇవ్వాలని హాస్టల్ వార్డెన్‌కు ప్రేమ్‌సాయి దరఖాస్తు చేశాడు. 13న సాయంత్రం అతడి తల్లిదండ్రులకు తాము విషయం చెప్పిన తరువాతే అనుమతి ఇచ్చి ఇంటికి పంపించాం. విద్యార్థి మృతిపై పోలీసు విచారణ సాగుతోంది. తోటి విద్యార్థులు దాడి చేసినట్లు ప్రేమ్‌సాయి ఎక్కడా ఫిర్యాదు చేయలేదు. విద్యార్థుల మధ్య గొడవ, దాడి జరిగినట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. - **కళాశాల యాజమాన్యం**

విద్యార్థి మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలి: సీపీఎం

బీటెక్ విద్యార్థి ప్రేమ్‌సాయి అనుమానాస్పద మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేసులు డిమాండ్ చేశారు. శనివారం పుట్టపర్తిలో ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లి విద్యార్థి మృతిపై యాజమాన్యంతోపాటు పోలీసులతో ఆరా తీశారు. ఇంతియాజ్ మాట్లాడుతూ విద్యార్థి మృతికి కళాశాల యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

భూ దురాక్రమణ నిషేధ బిల్లుపై అఖిలపక్ష సమావేశం జరపాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భూ దురాక్రమణ నిషేధ బిల్లు-2024పై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భూ దురాక్రమణ నిషేధ బిల్లు-2024లో కొన్ని అంశాలు పేదలపైన, పేదల పక్షాన నిలబడే ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి ఉద్దేశించినవిగా ఉన్నాయని విమర్శించారు. అభ్యంతరకరమైన వాటిని తొలగించి అక్రమంగా, దౌర్జన్యంగా ఆక్రమించుకున్న దురాక్రమణదారులకు శిక్ష విధించేలా, పేదలకు న్యాయం చేకూర్చేలా ఈ చట్టాన్ని సవరించడానికి సమావేశం నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో భూ దురాక్రమణల సమస్య ఉందని, అనేక మంది భూ యజమానులు తీవ్ర కష్టాలెదుర్కొంటున్నారని, పట్టణీకరణ, వ్యాపారీకరణ, పారిశ్రామికీకరణ నేపథ్యంలో భూ దురాక్రమణను అరికట్టేందుకు 1982 చట్టాన్ని రద్దు చేసి, ఆ స్థానంలో భూ దురాక్రమణ నిషేధ చట్టం 2024ను శాసనసభలో ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వం చెబుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తరహాలో ఈ చట్టం చేయాలని ప్రయత్నించి ప్రజలనుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కు తగ్గిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అదే విధానాన్ని కొనసాగించడం సరికాదన్నారు. రెండున్నర ఎకరాల మాగాణి, ఐదు ఎకరాల మెట్టలోపు సొంత భూములు కలిగిన పేద, మధ్యతరగి రైతులు, సొంత ఇల్లు లేని పట్టణ, గ్రామీణ పేదలు ప్రభుత్వ భూమి కలిగి ఉంటే వారికి ఈ చట్టం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్వీ నాయుడు పాల్గొన్నారు.

సేద్యం సినిమాకు అవార్డు


అవార్డు అందుకుంటున్న చంద్రకాంత్ పసుపులేటి

ధర్మవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎంఎస్ గ్యాలరీ ఫిల్మ్స్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణానికి చెందిన చంద్రకాంత్ పసుపులేటి దర్శకత్వంలో నిర్మించిన 'సేద్యం' సినిమాకు ఎంఈఐ సంస్థ ఉత్తమ సినిమా అవార్డు ప్రకటించింది. దర్శకుడు, రచయిత చంద్రకాంత్ మాట్లాడుతూ....రాయలసీమ రైతుల ఆత్మహత్యలపై సేద్యం సినిమాను తీశామన్నారు. ఈ సినిమాను గోరకాటి మహేశ్‌రెడ్డి, గాజుల పద్మావతి నిర్మించారని తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం చెన్నైలో జరిగిన ఎంఈఐ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి 1200 సినిమాలు వచ్చాయని, ఇందులో సేద్యం సినిమాకు జాతీయ ఉత్తమ అవార్డు వచ్చిందన్నారు. ఈ అవార్డును డైరెక్టర్, ఎంఈఐ సంస్థ చైర్మన్ మురుగై చేతుల మీదుగా అందుకున్నట్టు చంద్రకాంత్ తెలిపారు.

'మాలగుండ్ల'ను అడ్డుకుంటాం

- మాజీ ఎమ్మెల్యేకు ఉష శ్రీచరణ్ వర్గం హెచ్చరిక


మాట్లాడుతున్న ఉష శ్రీచరణ్ వర్గీయులు

గోరంట్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తున్న మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ గోరంట్లకు వస్తే వైసీపీ నాయకులే అడ్డుకుంటారని మాజీ సింగల్‌విండో అధ్యక్షుడు, వైసీపీ నాయకుడు గంపల రమణారెడ్డి హెచ్చరించారు. టీడీపీ కార్యకర్త రంగప్ప ఇంటిపై దాడిచేసిన వానవోలు ఉప సర్పంచ్ కుటాల బాబు, శ్రీనివాసులును విడిపించడానికి శంకరనారాయణ రెండురోజుల కిందట గోరంట్ల పోలీస్ స్టేషన్‌కు తన వర్గీయులతో వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ వర్గీయులు గోరంట్లలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో స్పందించారు. పార్టీ కోసం పని చేయడానికి వస్తే స్వాగతిస్తామని, మామధ్య చిచ్చుపెట్టాలని చూస్తూ సహించేదిలేదని రమణారెడ్డి తెలిపారు. పార్టీ కార్యక్రమాలు చేసే సమయంలో స్థానిక, పట్టణ, మండల కన్వీనర్లు తదితర ప్రముఖులు, జిల్లా అధ్యక్షులకు తెలిపితే కలిసి వస్తామని కన్వీనర్ వీరనారాయణరెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి తాము అందరిని ఆహ్వానించినా, శంకరనారాయణ వర్గం రాలేదన్నారు. పదేళ్లపాటు మీకోసం పార్టీ జెండా మోశాం. గ్రూపు రాజకీయాలు చేస్తూ, మాకు చెప్పకుండా దొంగలా వచ్చి పోవాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. వెన్నుపోటు రాజకీయాలు మాని, పార్టీ ఆదేశాల మేరకు పనిచేయాలని ఉప సర్పంచ్ రాజారెడ్డి హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో మీకు టిక్కెట్ కేటాయించినా, పార్టీ ఆదేశానుసారం పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

- కాగా దాడికేసులో నిందితుడైన వానవోలు ఉప సర్పంచ్ కుటాల బాబు పార్టీ స్పందనతో సోషల్ మీడియా ద్వారా తన సందేశాన్ని ప్రకటించారు. తాను కూడ వైసీపీలోనే పనిచేస్తున్నానని, మీరు శంకరనారాయణను అడ్డుకుంటే, తాముకూడా ఉష శ్రీచరణ్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు.

సంక్షిప్తం

ఎస్టీయూ సభ్యత్వ నమోదు



కేజీబీవీలో సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్టీయూ నాయకులు

కదిరి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ సభ్యత నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. శనివారం మండలంలోని పలు పాఠశాలల్లో సంఘం నాయకులు పర్యటించి సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువుభత్యం, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం నియమించిన 12వ పీఆర్సీ కమిషనర్ రాజీనామా చేసినందున వెంటనే నూతన కమిషనర్‌ను నియమించాలన్నారు. నిర్ణీత కాలపరిమితిలోపు నివేదిక తెప్పించుకుని వీలైనంత త్వరంగా కొత్త పీఆర్సీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, నాయకులు జవహర్, వీరమహేశ్వర, అశోక్‌కుమార్, రామచంద్రారెడ్డి, షాజహాన్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న గుండె ఉచిత వైద్య శిబిరం

ధర్మవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సమీపంలో ఈనెల 19న ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భీమనేని నారమ్మ జ్ఞాపకార్థం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఈనెల 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తామన్నారు. వైద్య శిబిరంలో కిమ్స్ సవేరా ఆస్పత్రి వైద్యులు పాల్గొని గుండెనొప్పి, గుండెదడ, ఆయాసం, కళ్లు తిరగడం, గుండెలోమంట కలగడం తదితర వాటికి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

గృహాలకు దరఖాస్తు చేసుకోండి

నంబులపూలకుంట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వం గృహాలు మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ శ్రావణి, వర్క్ఇన్‌స్పెక్టర్ క్రిష్టయ్య తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ సొంతంగా ఇంటి స్థలమున్నవారు మాత్రమే దఖాస్తు చేసుకోవాలన్నారు. అలాంటి లబ్ధిదారులు భార్యభర్త ఇరువురి ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డు, బ్యాంక్ ఖాతా, ఉపాధి జాబ్ కార్డు, ఆధార్ లింక్ కలిగిన ఫోన్ నెంబర్, పీఎంఏవై స్కీమ్ కింద న మోదు చేసుకోవాలన్నారు. సందేహాలుంటే హౌసింగ్ అధికారులను కలవాలన్నారు.

విద్యార్థులకు ఉచిత కోచింగ్

కదిరి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నవోదయ, సైనిక ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు పట్టణంలోని కేఎల్ఎన్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు రమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18నుంచి జనవరి 18వరకు ఉచిత కోచింగ్ ఇస్తున్నామని, వివరాలకు 9398629919 సంప్రదించాలన్నారు.

కాశీవిశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు ద్వారకనాథ్‌శర్మ

ధర్మవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అతిపురాతన దేవాలయంగా ఖ్యాతిని పొందిన కాశీవిశ్వనాథ దేవాలయంలో ఈశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. కార్తీక శనివారాన్ని పురస్కరించుకుని ఆలయంలో పట్టణానికి చెందిన పలువురు భక్తులు అభిషేకాలకు దాతృత్వం వహించడంతో ప్రత్యేక పూజలను చేపట్టినట్టు అర్చకుడు ద్వారకానాథ్‌శర్మ తెలిపారు. ఈ అభిషేకాలు, అర్చనలు డిసెంబరు 2వ తేదీ వరకు కొనసాగిస్తామన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఆర్డీఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వీఎస్ఎస్ శర్మ

కదిరి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిజాంవలీ కాలనీలో మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఆర్డీవో వీఎస్ఎస్ శర్మ తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రుచి చూశారు. పాఠశాల ఆవరణంలో చెత్త ఉండడం గమనించి ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఏపీడీ



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ రమేష్‌బాబు

గాండ్లపెంట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఎం తండా వద్ద చేస్తున్న ఉపాధి పనులను ఏపీడీ రమేష్‌బాబు శనివారం పరిశీలించారు. ఉపాధి పనుల్లో చేపడుతున్న చెరువులు, చెక్‌డ్యామ్‌లో చేస్తున్న పూడిక తీత పనులను తనిఖీ చేశారు. పూడికతీత వల్ల నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుందన్నారు. దీంతో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. కూలీల శాతం పెంచాలని సిబ్బందికి సూచించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

కదిరి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చని శాఖ గ్రంథాయాధికారి క్రిష్ణకిషోర్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాయలంలో గ్రంథాలయ ఉద్యమ కారులు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతోపాటు సమర యోధుల చరిత్ర పుస్తకాలు చదవాలన్నారు.

కందిని కమ్ముకున్న మేఘాలు

● పూత రాలిపోతోందని ఆందోళన
● చుట్టుముట్టిన తెగుళ్లు
● పంటపై సన్నగిల్లుతున్న ఆశలు





ధర్మవరం వద్ద కందిపంటపై కమ్ముకున్న మేఘాలు, నంబులపూలకుంట వద్ద పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

ధర్మవరం రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తుఫాన్ల ప్రభావంతో నిత్యం మేఘాలు కమ్ముకోవడంతో పూత రాలిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు వర్షాలు కురుస్తుండటంతో కంది పంటపై తీవ్ర ప్రభావం చూపి నష్టాలను చవిచూడాల్సి వస్తుందని అంటున్నారు. గతనెలలో తుఫాన్ల ప్రభావంతో పూత, పిందె రాలిపోయింది. రసాయనిక మందులు పిచికారి చేయడంతో మళ్లీ పూత,పిందె దశకు చేరుకుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కంది రైతుల గుండెల్లో గుబుళ్లు రేపుతోంది. మేఘాలు కమ్ముకుని అక్కడడక్కడ వర్షం పడుతుండటంతో ఉన్న పంటకూడా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో మండల వ్యాప్తంగా 7,600 ఎకరాల్లో కంది పంట సాగుచేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. కందిపంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. వేలకు వేలుపెట్టుబడులు పెట్టి ఇప్పటికే మూడుసార్లు రసాయనిక మందులను పిచికారి చేసి పంటను రక్షించుకుంటూ వస్తున్నామని రైతులు వాపోతున్నారు.

కంది పంటకు చీడపీడలు

నంబులపూలకుంట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కంది పంటకు చీడపీడలు ఆశిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత, పిందె ఉన్న సమయంలో వాతారణ పరిస్థితుల దృష్ట్యా పూత రాలిపోయి, పిందెకు పురుగులు పట్టాయి. మండల వ్యప్తంగా 1741 ఎకరాల్లో కంది పంట సాగుచేశారు. ప్రస్తుతం కందిపంట పూత రాలిపోగా, ఉన్న పిందెను కాయ తొలుచుపురుగు, రసంపీల్చే పురుగులు అధికంగా ఆశిస్తున్నట్లు ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం నంబులపూలకుంట వద్ద సాగుచేసిన కంది పంటను పరిశీలించారు. కందిని కాపాడుకోవడానికి మందులు పిచికారి చేయాలన్నారు.

వర్షాలతో రాలుతున్న పూత, పిందె



నేను ఐదు ఎకరాల్లో కంది పంటను సాగుచేశాను. ఇప్పటికే నాలుగు సార్లు మందులు పిచికారి చేశాను. వర్షాలకు పూత, పిందె రాలిపోతోంది. వర్షాలు కురుస్తుండటంతో ఆందోళనగా ఉంది. ఎన్నిసార్లు మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. కందిపంటపై ఉన్న ఆశలన్నీ తొలిగిపోతున్నాయి.

- రాఘవరెడ్డి, చిగిచెర్ల

పంటపై ఆందోళనగా ఉంది



నేను నాలుగు ఎకరాల్లో కంది పంటను సాగుచేశాను. ఒక్కపక్క తెగుళ్లు, మరోపక్క వర్షాలతో ఆందోళనగా ఉంది. నెలకిందట వర్షం వచ్చి పూత అంతా రాలిపోయింది. మళ్లీ మందులు కొట్టుకుని పంటను కాపాడుకుంటే ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో భయాందోళనగా ఉంది. తెగుళ్లు అధికంగా పట్టుకున్నాయి. పంటపై ఆశలు సన్నగిల్లుతున్నాయి.

- నాగభూషణ, గరుడంపల్లి

వర్షాలతో కందికి ఇబ్బంది లేదు



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కంది పంటకు ఇబ్బంది లేదు. ప్రస్తుతం కందిపంట కు మారుకమచ్చల పురుగు ఆశించి ఉంది. దీని ప్రభావంతో పైకి పూత, పిందె బాగా కనిపిస్తున్న లోపల మచ్చలపురుగు తినేస్తోంది. దీంతో పాటు శనగపచ్చ పురుగు ఎక్కువగా ఉండటంతో పంటకు నష్టం వాటిల్లుతోంది. మొగ్గదశలో వేపనూనె 1లీటర్ నీటికి 5ఎంఎల్, పూతదశలో క్లోరోపైరిపాస్ 1లీటర్ నీటికి 2.5 ఎంఎల్, కాయదశలో ఉంటే పినాయిల్‌పాస్, మారుకమచ్చల పురుగు నివారణ కోసం అసిపెట్, థైయోడికార్బ్, నవనూర 1ఎంఎల్‌ను పిచికారి చేసుకోవాలి.

-రామసుబ్బయ్య, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త

రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం

- అడ్డుకున్న స్థానికులు





రోడ్డును అక్రమించుకుని నిర్మిస్తున్న ఇల్లు, అడ్డుకుంటున్న స్థానికులు

ధర్మవరంరూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారకరామాపురంలో సబ్‌స్టేషన్ ఎదురుగా విద్యుత్‌శాఖ లైన్‌మ్యాన్ నరసింహులు రోడ్డుకు అడ్డంగా రాత్రివేళ ఇంటిని నిర్మిస్తుండటంతో స్థానికులు అడ్డుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మున్సిపాలిటీ అధికారులు వచ్చి రోడ్డుకు అడ్డంగా కట్టవద్దని 12 అడుగుల రోడ్డు ఉందని తెలిపారన్నారు. అధికారులు ఎవరు చెప్పినా వినేదిలేదని రోడ్డు ఆక్రమించుకుని 10 అడుగులు కూడా లేకుండా శనివారం రాత్రి వేళల్లో పైస్లాబ్ వేస్తుండటంతో స్థానికులు అడ్డుకున్నారు. రోడ్డుకు అడ్డంగా కడితే తాము ఇళ్ల వద్దకు ఎలా వెళ్లేది అంటూ అడ్డుకున్నారు. తనకు పై అధికారులందరూ తెలుసునని, ఎవరికైనా చెప్పుకోండి అంటూ నరసింహులు స్థానికులపై బూతులతో రెచ్చిపోయాడు. స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో మాట్లాడి కొలతలకు అనుగుణంగా నిర్మించుకోవాలని, అంతవరకు స్థానికులకు ఇబ్బంది లేకుండా నిలిపేయాలని తెలిపారు.

ఆదమరిస్తే అంతే..!



పాత బతల్లపల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న బావి

నల్లమాడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతబత్తపల్లి గ్రామ వద్ద ప్రధాన రహదారి పక్కనే పెద్ద బావి ఉంది. వాహనదారులు, పాదచారులు ఆదమరిస్తే అంతే గతని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కదిరి నుంచి పాతబత్తలపల్లి మీదుగా నల్లమాడకు వెళ్లే ప్రధాన రహదారికి అనుకుని 30 అడుగుల లోతైన బావి ఉంది. ప్రధాన రహదారి నుంచి బావి అంచు వరకు పిచ్చి గడ్డి ఏపుగా పెరిగింది. వాహనాలు అతివేగంగా పొరపాటున పక్కకు జారితే బావిలో పడాల్సిందే. బావి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు. పంచాయతీ అధికారులు సమస్యను గుర్తించి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు.

మహిళా చైతన్యంతో సమాజానికి వెలుగు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ

కదిరి లీగల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళలు చైతన్యవంతులైతేనే సమాజం ప్రకాశవంతంగా వెలుగుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. తలుపుల ఆర్డీటీ కార్యాలయంలో శనివారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ జయలక్ష్మీ ఆధ్వర్యంలో న్యాయ సదస్సులు కొనసాగుతున్నాయి. సదస్సుకు ఆర్డీటీ ఆర్‌డీ శాంతమ్మ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెరుగైన సమాజం ఆవిర్భావం కోసం మహిళా చైతన్యం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. ఆర్డీటీ మహిళా సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలను కూడా వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది లోకేశ్వర్‌రెడ్డి, ఐసీడీఎస్ ప్రాజెక్టు నుంచి నిహారిక, కార్మిక విభాగం సరస్వతి, రెడ్ సంస్థ ఎల్లప్ప, మైత్రి ప్రతిభా మహిళ సంఘం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పూజా సామగ్రి వితరణ

ఓబుళదేవరచెరువు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయానికి 41రోజులకు పూజా సామగ్రిని శనివారం ముస్లిం నాయకుడు టైలర్ నిజాం అందించారు. తహసీల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ చేతుల మీదగా పూజా సామగ్రిని అందించినట్లు ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయనాయుడు తెలిపారు. నిజాం గత 13 యేళ్లుగా అయ్యప్ప ఆలయానికి పూజా సామగ్రిని అందించడమేకాకుండా అన్నదాన సౌకర్యం కల్పిస్తున్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పిట్టా ప్రభాకర్‌రెడ్డి, వృద్ధాశ్రమ నిర్వాహకులు అరుణజ్యోతి, నాగేశ్వరయ్య, ఆలయ సేవకులు రవి, బాబురెడ్డి, ప్రసాద్, సుమంత్ పాల్గొన్నారు.

రామాలయంలో కార్తీకమాస పూజలు



ఆకుపూజ అలంకరణలో సీతారాములు, ఆంజనేయస్వామి

ధర్మవరం రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల గ్రామంలో వెలసిన సీతారాములు, ఆంజనేయస్వామికి కార్తీకమాసాన్ని పురష్కరించుకుని ప్రతిరోజు విశేషపూజలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. శనివారం ఆకుపూజతో పాటు వివిధ రకాల పూలమాలలతో మూలవిరాట్‌లను అందంగా అలంకరించి విశేష పూజలు చేశారు. రాత్రివేళల్లో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

బాలల హక్కులను కాపాడాలి: ఎంఈఓ

తనకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యత అని ఎంఈఓ కల్యాణి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సమత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవాహాలు, పోక్సో ఉచిత నిర్భంధ చట్టాల గురించి తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, సమత కోఆర్డినేటర్ శ్రీనివాసులనాయుడు, ప్రిన్సిపాల్ హమీదాబీ, కమ్యూనిటీ మొబలైజర్ మౌనిక పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు

ధర్మవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయవారోత్సవాలలో భాగంగా శనివారం ధర్మవరంశాఖ గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, హనుమంతరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, రంగనాథ్ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి అంజలిసౌభాగ్యవతి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శివమ్మ, రమణానాయక్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.20వేల విరాళం



విరాళం అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

తనకల్లు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనసానివారిపల్లి సమీపంలో బైరాగి గుట్ట వద్ద ఉన్న బైరాగిస్వామి ఆలయ అభివృద్ధికి కదిరికి చెందిన శివసాయి సీడ్స్ ప్రతాప్‌రెడ్డి రూ.20 వేలు విరాళాన్ని కమిటీ సభ్యులకు శనివారం అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మా ట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం సాయం చేసిన ప్రతాపరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో జీవించండి: ఎస్ఐ

ధర్మవరం రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలందరూ గొడవలకు దూరంగా ఉండి ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని సీతారంపల్లి, సుబ్బరావుపేట గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రజలతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ఎస్ఐ మాట్లాడుతూ ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మద్యానికి బానిస కాకూడదని, పేకాటకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం సైబర్‌క్రైమ్, రోడ్డుప్రమాదాల నివారణ కొరకు అవగాహన కల్పించారు.

వైద్యసేవలకే పరిమితం చేయాలి

కొత్తచెరువు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఏలను వైద్యసేవలకే పరిమితం చేయాలని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. ఈమేరకు వారు శనివారం ఎంపీడీఓ నటరాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ లింగా రామ్మోహన్ మాట్లాడుతూ...సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఏలకు సచివాలయ కార్యదర్శులు ఇతర పనులకు ఉపయోగిస్తుండటంతో ప్రజలకు వైద్యసేవలు సకాలంలో అందడం లేదన్నారు. ఈ ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం జీఓ నెంబరు 24ను అమలు చేస్తూ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ జీఓ ప్రకారం పంచాయతీ కార్యదర్శులకు ఆరోగ్యసిబ్బంది వైద్యసేవలకే పరిమితం చేసేవిధంగా సచివాలయ కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి : పల్లె



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తిరూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంతి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి సూచించారు. ఈనెల 18 నుంచి సత్యసాయి జయంతి వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం ఆయన మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాదతో కలిసి గణేష్ కూడలి, కర్ణాటకనాగేపల్లి, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, చింతతోపు జైజంక్షన్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా పారిశుధ్య లోపం లేకుండా చూడాలన్నారు. ప్రధాన కూడళ్లలో వీది దీపాలను ఏర్పాటుచేసి అందంగా తీర్చితిద్దాలని, వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

కోర్టు ఆవరణాన్ని శుభ్రం చేసిన సిబ్బంది



శుభ్రం చేస్తున్నకోర్టు సిబ్బంది

కదిరి లీగల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కదిరి కోర్టుల ఆవరణమంతా సిబ్బంది నడుం బిగించి శుభ్రం చేశారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా రాష్ట్ర హైకోర్టు, జిల్లాకోర్టుల ఆదేశాల మేరకు శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ న్యాయాధికారి జయలక్ష్మీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది ఆవరణమంతా చెత్తాచెదారాలను, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నివేదిత

పుట్టపర్తిరూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డలకు శ్రేయస్కరమని ఎస్సీడీ, సీడీ, ఆర్‌బీఎస్కే జిల్లా ప్రోగ్రాం డైరక్టర్ డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. శనివారం మండలపరిధిలోని వెంకటగారిపల్లిలో బాలలసంపూర్ణ ఆరోగ్యరక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్వాడీ సెంటర్‌ను తనిఖీ నిర్వహించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను వివరించారు. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి పాలను తాగించాలని తెలిపారు. క్రమం తప్పకుండా చిన్నారులకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నగేష్, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీనారాయణమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



నాగభూషణంనాయుడుని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నల్లమాడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్ఎంపీ వైద్యుడు బుట్టి నాగభూషణంనాయుడుకు మదర్ థెరిసా అవార్డు వచ్చిన సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు సన్మానించారు. శనివారం స్వాతి క్లినిక్‌లో శాలువ, పూలమాలతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ అవార్డుతో నాగభూషణంపై మరింత సేవాభారం పడిందని అన్నారు. పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు నరసింహులు, కేశవరెడ్డి, క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

పెనుకొండ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): త్వరలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయని దానికి సన్నద్ధం కావాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ, ఇరిగేషన్ డీఈఈ యోగానంద్ ఆధ్వర్యంలో ఎన్నికలకు సంబంధించి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెనుకొండ డివిజన్‌లోని పెనుకొండ, హిందూపురం, మడకశిర మండలాలకు సంబంధించి 140చెరువులున్నాయని వాటన్నింటికీ ఎన్నికలు జరుగనున్నాయని అన్నారు. ఒక్కో చెరువుకు సంబంధించి ఆరు గురు డైరెక్టర్లుంటారని అందులోనే ఒకరు అధ్యక్షులుగాను, మరొకరు ఉపాధ్యక్షులుగాను ఉంటారన్నారు. ఎన్నికల ప్రక్రియను ఏవిధంగా నిర్వహించాలనే విషయంపై పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ యోగానంద, డీఈ లక్ష్మీనారాయణ, పెనుకొండ డివిజన్ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం



మందకృష్ణకు స్వాగతం పలుకుతున్న నాయకులు

చిలమత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందక్రిష్ణ మాదిగకు ఎమ్మార్పీఎస్ నాయకులు, టీడీపీ నాయకులు కొడికొండ చెక్‌పోస్టులో ఘన స్వాగతం పలికారు. ఆయన శనివారం అనంతపురానికి రోడ్డు మార్గాన బెంగళూరు నుంచి వస్తున్న సందర్భంగా కొడికొండ చెక్‌పోస్టు వద్ద రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్. టీడీపీ నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడి విజయం సాధించినందుకు ఆయనకు మాదిగలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు సోమశేఖర్, శివ, వెంకటేశులు, ఆటో నజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

చిలమత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి మండల వ్యాప్తంగా మొబైల్ ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 19, 20వ తేదీలలో చిలమత్తూరు-1 సచివాలయానికి సంబంధించి జూనియర్ కళాశాలలో, 21న చిలమత్తూరు-1 సచివాలయానికి జెడ్పీ పాఠశాలలో, 22న దేమకేతేపల్లి-1 సచివాలయానికి దేమకేతేపల్లిలో, 26న టేకులోడు గురుకుల పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలలో, 27న కోడూరు-1 విద్యార్థులకు అక్కడే, 28న కొడికొండ పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలలో, 29న సోమఘట్ట పాఠశాల విద్యార్థులకు కూడా అక్కడే ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మొబైల్ కేంద్రాలకు విద్యార్థులు తప్పక హాజరై ఆధార్‌లో చేర్పులు, మార్పులు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెనుకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయప్ప మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక రంగంలో పుస్తకపఠనం తగ్గిందన్నారు. పుస్తకపఠనం ద్వారానే విజ్ఞానం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను వైస్‌ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కాంతరావు, శ్రీదేవి, హరిప్రసాద్, సువర్ణ పాల్గొన్నారు.

రబీ వేరుశనగ కోసం నమోదు చేసుకోవాలి

మడకశిర రూరల్, గుడిబండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): 2024-2025 రబీలో బావులు, బోర్లు కింద వేరుశనగ సాగుచేసే రైతులు విత్తన వేరుశనగ కోసం రైతు సేవా కేంద్రాల్లో తమపేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు తిమ్మప్ప, వీరనరేష్‌లు తెలిపారు. 30 కిలోల బస్తా వేరుశనగ రూ.2880లు కాగా, సబ్సిడీ రూ.1140లు పోను రైతు కట్టాల్సిన రూ.1740లు చెల్లించాల్సి ఉందన్నారు. ఒక్కో రైతుకు మూడు బస్తాలు చొప్పున పంపిణీ చేస్తామన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, విద్యుత్ బిల్లు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వేరుశనగ బస్తాలకు రైతులు ముందుగా నగదు చెల్లించి టోకన్లు తీసుకోవాలని ఏఓలు కోరారు.

బాలికలను రక్షించడమే ధ్యేయం

పెనుకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బాలికలను వేధింపుల నుండి రక్షించడమే పోలీసుల ధ్యేయమని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాన్ని పురస్కరించుకుని సీడీపీఓ శాంతలక్ష్మీ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ మాట్లాడుతూ, తనను దుష్టశక్తులు, అల్లరిమూకల నుంచి ఎలా రక్షించుకోవాలనే అంశంపై వాస్తవంగా జరిగిన కొన్ని సంఘటనలను వివరించారు. ప్రతి బాలిక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దానికి అనుగుణంగా కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సీడీపీఓ శాంతలక్ష్మీ మాట్లాడుతూ మనిషి ఆరోగ్యం బాగుంటే పోటీ ప్రపంచంలో నిలబడే శక్తి ఉంటుందన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారిని నాగలక్ష్మీ, తిరుమల, ఆనంద్, కొండప్ప పాల్గొన్నారు.

అపార్‌పై అధికారుల సమీక్ష

గోరంట్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆపార్ ద్వారా 9వతరగతినుంచి డిగ్రీవరకు చదువుతున్న విద్యార్థుల పుట్టిన తేదీ, పేర్ల మార్పులపై గోరంట్లలో అధికారులు శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్ర కుమార్, ఎంఇఓ జాన్‌రెడ్డెప్ప, మండలంలోని సీఆర్పీలు, ఆధార్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం జరిపారు. మండలంలో 11,200 విద్యార్థులకుగాను 4,018మంది వివరాలు సరిచేయాల్సి ఉందన్నారు. నాన్‌అవెలెబులిటీ, పుట్టిన తేదీ విషయాల్లో తగిన సూచనలిస్తూ, పేర్ల మార్పు, పుట్టినతేదీలు మార్చాలని సూచించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓలు పాలసముద్రం గ్రామంలో పర్యటించి అక్కడ 175మందికి పుట్టిన తేదీలు, 230మందికి పేర్లు మార్పు చేయాల్సిఉండడంతో సిబ్బందిని అప్రమత్తం చేశారు.

ఫ్రీజర్‌లేని మార్చురీ

కుళ్లిపోతున్న అనాథ శవాలు



● శిథిలావస్థకు చేరుకున్న హిందూపురం ఆసుపత్రి శవ పరీక్ష గది ● నెలలో కనీసం 20 మృతదేహాలకు పోస్టుమార్టం

హిందూపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :ఒక మనిషి అంతిమ యాత్ర కూడా గౌరవంతో ముగియాలని న్యాయశాస్త్రం చెబుతోంది. కాని హిందూపురం జిల్లా ఆసుపత్రిలో శవాలకు ఆ గౌరవం దక్కడంలేదు. పురం ప్రభుత్వ ఆసుపత్రిలో నెలలో కనీసం 20దాకా మృతదేహాలకు శవపంచనామా నిర్వహిస్తుంటారు. కాని మార్చురి గదిలో ఫ్రీజర్‌బాక్స్ లేకపోవడంతో శవాలు కుళ్లిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో కొంతమంది ఫ్రీజర్‌బాక్స్‌లను అద్దెకు తీసుకుని శవపరీక్ష పూర్తయిన తరువాత తిరిగి అప్పగిస్తున్నారు. అయితే ఒకరోజుకు 3నుంచి 4వేలు చెల్లించేందుకు సామాన్య ప్రజలు జంకుతున్నారు. రహదారి ప్రమాదాలు, ఆత్మహత్యలు, హత్యలు, రైలు కిందపడినవారు, గుర్తుతెలియని మృతదేహాలు ఇలా కారణం ఏదైనా హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి రోజూ ఏదోఒక శవం వస్తూనే ఉంటుంది. ఆయా సంఘటనలపై కేసునమోదుచేసిన పోలీసులు శవపంచనామా కోసం మృతదేహాలను హిందూపురం ఆసుపత్రికి తరలిరచి అక్కడ మార్చురి గదిలో ఉంచుతున్నారు. ఈగదిలో రెండు మూడు మృతదేహాలు ఉంచేందుకు అరుగు కట్టారు. ఒకేసారి మూడు నాలుగు మృతదేహాలు వస్తే కిందే పడేస్తున్నారు.

శిథిలావస్థలో మార్చురీగది

ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఆసుపత్రి కోసం కేటాయిస్తున్నా హిందూపురంలో మార్చురిగది నూతనంగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేయకపోవడం దురదృష్టకరం. ఎప్పుడో 20ఏళ్ల క్రితం నిర్మించిన గదిలోనే మృతదేహాలకు శవపరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే అది శిథిలావస్థకు చేరడంతో ఆ పక్కనే దోబీలు ఉపయోగించే చిన్నగదిని ప్రస్తుతం శవపరీక్షల కోసం ఉపయోగిస్తున్నారు. నూతనంగా శవపరీక్షల కోసం గది నిర్మించి అందులో కనీసం మూడునాలుగు ఫ్రీజర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే హిందూపురం నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారులున్నాయి. దీంతోపాటు పదుల సంఖ్యలో పరిశ్రమలున్న తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడ ఉంది. ఈ పరిస్థితుల్లో మార్చురి గది నూతనంగా నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అనాథ శవాలుగా ఖననం

గుర్తుతెలియని మృతదేహాలను పోలీసులు తీసుకొచ్చి ఆసుపత్రిలో ఉంచుతున్నారు. కాని ఆసుపత్రి మార్చురి గదిలో ఫ్రీజర్ లేకపోవడంతో ఆ శవాలు ఒకటి రెండు రోజులకు మించి ఉంచడానికి వీలులేకుండా పోతోంది. అంతలోపు బంధువులు రాకపోవడంతో మృతదేహాలను మునిసిపల్, పోలీసులు అనాథశవాలుగా ఖననం చేస్తున్నారు. అదే ఫ్రీజర్లు ఉండుంటే గుర్తుతెలియని మృతదేహాలను గుర్తించే అవకాశముంటుంది.

ప్రతిపాదనలు పంపాం..

హిందూపురం ప్రభుత్వఆసుపత్రిలోని మార్చురీగది శిథిలావస్థకు చేరింది. దీంతో నూతనంగా గదిని నిర్మించాలని కొద్దిరోజుల క్రితం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అయితే ఫ్రీజర్ బాక్సులు జిల్లాకేంద్రాల్లో ఏర్పాటు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో హిందూపురం ఆసుపత్రికి కూడా వీటి అవసరం ఉంది. దీనిపై కూడా ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతాం.



లింగన్న,ఆసుపత్రి సూపరింటెండెంట్

కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి



మాట్లాడుతున్న ఏడీజే కంపల్లె శైలజ

హిందూపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : మెగా లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ విజ్ఞప్తిచేశారు. న్యాయవాదులు, పోలీసు అధికారులతోకలిసి ఆమె శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ పరిష్కారమయ్యే కేసులు అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా చితికిపోవడంకంటే పరిష్కరించుకోవడం మంచిదన్నారు. దీనికి పోలీసులు చొరవ చూపాలన్నారు. డిసెంబర్ 14న జరిగే మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి శ్రీధర్, సెకెండ్‌క్లాస్‌మెజిస్ట్రేట్ శివ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బిర్సాముండా సేవలు ఎనలేనివి

సోమందేపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : భగవన్ బిర్సాముండా సేవలు ఎనలేనివని నాయకులు, అధికారులు కొనియాడారు. శనివారం మండల పరిధిలోని నాగినాయనిచెరువు తాండాలో గ్రామసభ ఏర్పాటు చేశారు. సర్పంచ్ అంజినాయక్ పాల్గొన్నారు.

మార్చినాటికి గృహనిర్మాణాలు పూర్తిచేయాలి

● మండలమీట్‌లో ఏఈ సూచన



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేష్‌కృష్ణ

పెనుకొండ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న గృహాలు మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేసుకోవాలని లేనిపక్షంలో గృహాలకు మంజూరైన నిధులు తిరిగి వెళ్లిపోతాయని హౌసింగ్ ఏఈ శ్రీనాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ నరేష్‌కృష్ణ ఆధ్వర్యంలో మండలమీట్ జరిగింది. ఎంపీడీఓ నరేష్‌కృష్ణ మాట్లాడుతూ ప్రజలు సంక్షేమ పథకాలు పొందాలంటే వారి బ్యాంక్ ఖాతాలను అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వ్యవసాయాధికారులు గ్రామస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యటించి జరిగిన నష్టంపై నివేదికలు తయారుచేసి పై అధికారులకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చదువు మీద శ్రద్ధ పెడితేనే ఉన్నత శిఖరాలు



డీఎస్పీని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

హిందూపురం అర్బన్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుమీద శ్రద్ధ పెడితే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని డీఎస్పీ మహేష్, వన్‌టౌన్ సీఐ రాజగోపాలనాయుడులు పేర్కొన్నారు. శనివారం పట్టణ పరిధిలోని ఎన్ ఎస్‌పిఆర్ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రిన్సిపల్ ప్రగతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డేకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం సెల్‌ఫోన్‌లకు అలవాటు పడుతున్నారని అలా కాకుండా తరగతుల్లో గురువులు బోధించే పాఠాలను శ్రద్ధతో విని వాటిని ఆచరిస్తే తప్పకుండా ఉన్నతలక్ష్యం వైపు అడుగులు పడతాయని సూచించారు. అనంతరం యూనివర్సిటీ పరీక్షల్లో బీఎస్సీలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఉర్దూ భాషా సమితి అధ్యక్షుడు మహ్మద్ రఫీక్, బీకాంలో మెరిట్ వచ్చిన విద్యార్థులకు జీఎస్టీ అధికారి గిరిధర్, బీఏలో మెరిట్ వచ్చిన విద్యార్థులకు చరిత్ర అధ్యాపకుడు, ప్రస్తుత అకడమిక్ కో ఆర్డినేటర్ డా. శ్రీధర్‌లు గోల్డ్‌మెడల్‌లు అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ, సీఐలను సన్మానించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

గుడిబండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు, కురుబరపల్లి, హిరేతుర్పి, బి.టి.పల్లి గ్రామాల్లో వెలిసిన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక శనివారం సందర్భంగా భక్తులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూలతో అలంకరించి ఆకుపూజ, అభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

రేపు ఎస్ఎఫ్ఐ మహాధర్నా

పెనుకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న విజయవాడలో ధర్నాచౌక్‌లో జరిగే మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి హర్షకుమార్ పిలుపునిచ్చారు. అసెంబ్లీలో పెండింగ్ బకాయిల గురించి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు.

మందలపల్లి బీసీ హాస్టల్ వార్డెన్ కేశవప్పపై డీడీ ఆగ్రహం

గుడిబండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గుడిబండ మండలం మందలపల్లి బీసీ హాస్టల్ వార్డెన్ కేశవప్పపై సత్యసాయి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ నిర్మలాజ్యోతి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. గత వారం రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో బీసీ హాస్టల్‌లో మాయ అనే శీర్షికన 123 మందికిగాను 45 మంది హాజరు అనే కథనం ఆంధ్రజ్యోతిలో గత వారం రోజుల క్రితం ప్రచురితం అయింది. అందుకు స్పందించిన డిప్యూటీ డైరెక్టర్ నిర్మలాజ్యోతి మందలపల్లి బీసీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల హాజరుశాతం, మెనూ, తదితర వాటిపై విద్యార్థులతో వివరాలను అడిగి తెలుసుకొన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన వార్డెన్ కేశవప్పపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మెమో జారీ చేశారు.

పెండింగ్ మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలి



గోరంట్ల హాస్టల్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

గోరంట్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బిసి,ఎస్సీఎస్టీ, మైనార్టీ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు చెల్లించాల్సిన మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ప్రగతి శీల విద్యార్థి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. ఇందుకోసం గోరంట్లలోని బిసి హాస్టల్ వద్ద విద్యార్థులతో కలిసి శనివారం నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాలు 2733 ఉన్నాయని, అందులో 3,13,695మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. గత ఆరునెలలుగా మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల కాలేదన్నారు. ధరలు అధికంగా ఉన్న సమయంలో మెస్ బిల్లులు, నెలనెల అందకపోవడంతో వార్డెన్లు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. అలాగే విద్యార్థులకు దుప్పట్లు, యూనిఫారం దుస్తులు, తదితర సామాగ్రి సకాలంలో అందేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు తరణ్, మహేష్, ప్రసాద్, మారుతి, రేవత్ తదితరులున్నారు.

అభివృద్ధి పథకాలకు శ్రీకారం

పెనుకొండ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంతలమయంగా మారిన రోడ్ల మరమ్మతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని టీడీపీ సీనియర్ నాయకులు మాధవనాయుడు పేర్కొన్నారు. మంత్రి సవిత ఆదేశాల మేరకు రూ.30లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం

పెనుకొండ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తన భర్త అనుమానాస్పదంగా మృతిచెందాడని జిల్లా ఎస్పీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు గౌరి అనే మహిళ ఫిర్యాదు చేయడంతో వెంకటరెడ్డిపల్లి సమీపంలో ఎంఆర్ శంకర్ మృతదేహానికి అధికారులు రీ పోస్ట్‌మార్టం నిర్వహించారు. వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎంఆర్ శంకర్ సోమందేపల్లి మండలం జూలుకుంట గ్రామానికి చెందిన గౌరీతో వివాహం జరిగింది. ఎంఆర్ శంకర్ దుద్దేబండ క్రాస్‌లోని కియా కార్లపరిశ్రమ ఎదురుగా ఉన్న ఎన్ఎఫ్‌సి హోటల్‌లో పనిచేస్తుండేవాడు. 2022లో జూలై నెలలో ఎంఆర్ శంకర్ హోటల్‌లో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వస్తుండగా తిమ్మాపురం సమీపంలోని సోలార్ కంపెనీవద్దకురాగానే రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అప్పట్లో పెనుకొండ పోలీసులు రోడ్డు ప్రమాదానికి గురైనట్లు కేసు నమోదు చేశారు. కానీ మరణంపై ఆయన భార్య అనుమానం వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని జిల్లా ఎస్పీకు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో అనంతపురం మెడికల్ కళాశాల ప్రొఫెసర్ శంకర్, తహసీల్దార్ శ్రీధర్, మడకశిర సీఐ రాజ్‌కుమార్ వెంకటరెడ్డిపల్లిలోని రైలుపట్టాల పక్కన ఖననం చేసిన ప్రదేశానికి చేరుకుని మృతదేహాన్ని కుటుంబ సభ్యుల సమక్షంలో రీ పోస్ట్‌మార్టం నిర్వహించారు. పోస్ట్‌మార్టం నివేదికలు రాగానే పరిశీలిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన సాయికుమార్

గోరంట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదిలిరోడ్డులో గోల్లపల్లి క్రాస్‌వద్ద ద్విచక్రవాహనం కారును ఢీకొన్న సంఘటనలో సాయికుమార్ శనివారం తీవ్రంగా గాయపడ్డారు. కాగానిపల్లికి చెందిన సాయికుమార్ సోమందేపల్లి సమీపంలోని కియా అనుబంధ పరిశ్రమలో పనిచేస్తూ రోజు విధులకు వెళ్లి వస్తున్నారు. పరిశ్రమలో రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై శనివారం ఉదయం స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కదిరి వైపునుంచి బూదిలివైపు వెళ్తున్న కారును గోరంట్ల వైపునుంచి వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో సాయికుమార్ ఎడమకాలు నుజ్జునుజ్జు అయింది. గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.


రామ్మూర్తి నాయుడి మృతి బాధాకరం: జడ్పీటీసీ ఉమేష్

అగళి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమ్ముడు మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని వారి ఆత్మకు శాంతి చేకూరాలని జెడ్పీటీసీ ఉమేష్ పేర్కొన్నారు. మండల కన్వీనర్ కుమారస్వామి, క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అభిమానులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను భగవంతుడు ఆయురారోగ్యాలతో చల్లగా చూడాలని కోరారు.

ప్రాచీన కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి

గుడిబండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రాచీన కళలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని పి.సి.గిరి లింగార్య ఆశ్రమ పీఠాధిపతులు ద్యావేరప్ప పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఆశ్రమంలో గ్రామస్తులు, భక్తులతో భజన, ప్రాచీన కళలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామాల్లో భజనలు, పౌరాణిక నాటికలు, హరికథలు, బుర్రకథలు, సంగీతం, కోలాటలు, చక్కభజనలు, ప్రదర్శించేవారన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రాచీన కళలు కనుమరుగయ్యాయన్నారు. అయితే ప్రస్తుతం ప్రజలు టీవీలు, సెల్‌ఫోన్‌లకు పరిమితం అయ్యారని అన్నారు. ప్రభుత్వం ప్రాచీన కళలకు జీవం పోసి కళలను పోత్సహించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాగరాజు, మర్రిస్వామి, చిక్కన్న, రాజన్న, హంపేగౌడ్, గంగమ్మ పాల్గొన్నారు.

నౌకర్ల సంఘం అధ్యక్షుడిగా రవికుమార్ ఎన్నిక



ఎన్నికైన అధ్యక్షుడు రవికుమార్, కోశాధికారి శేఖర్‌బాబు

పావగడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర నౌకర్ల సంఘం తాలూకా అధ్యక్షులుగా రవికుమార్, కోశాధికారిగా శేఖర్‌బాబు, రాజ్య పరిషత్ సభ్యుడిగా గంగాధర్ గెలుపొందారు. ఈనెల 3వతేదీన 34 ప్రభుత్వ శాఖలకు జరిగిన ఎన్నికల్లో 23 మంది సభ్యులు ఏకగ్రీవం కాగా 11 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. శనివారం జరిగిన అధ్యక్ష ఎన్నికలకు రవికుమార్, యతికుమార్‌లు నామినేషన్లు దాఖలు చేయగా కోశాధికారి స్థానానికి శేఖర్‌బాబు, రామాంజినప్పలు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. రాజ్యపరిషత్ సభ్యత్వానికి గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా అధ్యక్ష, కోశాధికారి స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఈఎన్నికల్లో రవికుమార్ అధ్యక్షునిగా గెలుపొందగా, కోశాధికారి స్థానానికి జరిగిన ఎన్నికల్లో శేఖర్‌బాబు గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రిన్సిపల్ రామకృష్ణప్ప తెలియజేశారు. గెలుపొందిన అధ్యక్ష, కోశాధికారిని ఎమ్మెల్యే వెంకటేష్ అభినందించారు.

ఒంటరి మహిళ చైత్రమ్మకు ఆర్డీటీ సాయం

రొళ్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సంస్థ ఒంటరి మహిళ చైత్రమ్మకు నిర్మించిన ఇంటిని శనివారం స్పెయిన్ దేశానికి చెందిన ఇరాటీ, అల్మా అనేమహిళలు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సంస్థ సిబ్బంది ఏటీఎల్ ఓబులేశు, రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున, రీజినల్ ఇంజనీర్ రంగనాయకులు కమ్యూనిటీ ఆర్గనైజర్లు హనుమంతరాయుడు హాజరయ్యారు. రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ సంస్థ ఒంటరి మహిళలకు ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు.

క్రైం కార్నర్

మహిళా సెక్యూరిటీగార్డుపై సూపర్‌వైజర్ దాడి



కార్మిక నాయకులతో బాధితురాలు రాజేశ్వరి

గోరంట్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలివద్ద గల శాడిల్స్ కియా అనుబంధ పరిశ్రమలో పని చేస్తున్న సూపర్‌వైజర్ త్రివేదిలాల్‌నాయక్ తనపై దాడిచేసి గాయపరిచినట్లు సెక్యూరిటీగార్డు రాజేశ్వరి గోరంట్లపోలీసులకు శనివారం ఫిర్యాదుచేసింది. గోరంట్లలోని పులేరు రోడ్డులో నివాసముంటున్న రాజేశ్వరి గత మూడేళ్లుగా పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా ఉద్యోగం చేస్తోంది. భర్త దూరమవడంతో కుమారుడిని పోషిస్తూ జీవనం సాగిస్తోంది. అక్కడే సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పుట్టపర్తిమండలం పెడబల్లికి చెందిన త్రివేదిలాల్‌నాయక్ తనను వేధించేవాడని, ఉద్యోగం నుంచి తొలగిస్తానంటూ సెక్యూరిటీ మేనేజర్ శాంతరాజుకు తనపై లేనిపోనివి చెప్పడంతో ఆయన తనను శుక్రవారం మందలించారన్నారు. ఈవిషయంపై శనివారం ఉదయం ఇరువురిమధ్య వాగ్వివాదం జరగడంతో సూపర్‌వైజర్ తనను కొట్టారన్నారు. పోలీసుల సూచన మేరకు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమె చికిత్స చేయించుకున్నారు. దాడి విషయం తెలుసుకున్న సీఐటియు నాయకులు ఆమెను వెంటపెట్టుకుని పరిశ్రమ వద్దకు వెళ్లి హెచ్‌ఆర్‌కు ఫిర్యాదు చేశారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పాపం చిన్నారి!

భార్యభర్తల గొడవలో బాలికకు గాయాలు

పరిగి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలోని బిందునగర్ కాలనీలో కాపుర ముంటున్న ఓ భార్యాభర్తలు ఘర్షణ పడగా మధ్యలో వారి చిన్నారి ప్రణతి(4) గాయపడింది. స్థానికుల సమాచారం మేరకు సుబ్రమణ్యం, శ్రీకన్య, చిన్నారి తల్లిదండ్రులు హోటల్ నిర్వహించేవారు. అదే కాలనీకి చెందిన బియ్యంవ్యాపారి బియ్యం బస్తా బాకీ ఇవ్వాలంటూ చిన్నారి తండ్రి అయిన సుబ్రమణ్యంను కోరగా తల్లి సుకన్య బాకీ ఇప్పటిదాకా చెల్లించలేదా? అంటూ భర్తను ప్రశ్నించారు. మాటామాటా పెరగడంతో భార్యభర్తల మధ్య గొడవ తీవ్రతరమైంది. ఇంతలో అక్కడే అన్నం తయారు చేసేందుకు ఉంచిన మరుగుతున్న నీరు చింది ఒక్కసారిగా చిన్నారి శరీరంపైపడి ఆ బాలిక తీవ్ర గాయాలపాలైంది. స్పందించిన స్థానికులు బాలికను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చిన్నారిని బెంగళూరుకు తరలించారు. ఎస్ఐ రంగడు యాదవ్‌ను వివరణ కోరగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.